శుక్రవారం
30-12-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 188
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

బ్రహ్మోస్ ప్రయోగం విజయవంతం

బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రూయిజ్ ఎక్స్‌టెండెడ్ రేంజ్ వెర్షన్‌ను గురువారం సుఖోయ్-30ఎంకెఐ యుద్ధ విమానం నుంచి భారత్ విజయవంతంగా ప్రయోగించింది.

2లో

చలో రాజ్‌భవన్
ఉద్రిక్తం

సీపీఐ కార్యాలయం వద్ద పోలీసుల మోహరింపు

- ర్యాలీని అడ్డుకున్న ఖాకీలు
- అక్రమ అరెస్టులు.. పోలీస్‌స్టేషన్‌కు తరలింపు
- రాజ్యాంగ పరిరక్షణకు కదలాలని రామకృష్ణ పిలుపు

విశాలాంధ్ర -విజయవాడ: సమాఖ్య వ్యవస్థను పరిరక్షించాలని, గవర్నర్ల వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ సమితి పిలుపు మేరకు విజయవాడలో సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి గురువారం చేపట్టిన 'చలో రాజ్‌భవన్' ఉద్రిక్తతకు దారితీసింది. పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో దాసరి భవన్‌కు చేరుకున్నారు. అదేసమయంలో పోలీసులు కూడా భారీ సంఖ్యలో పార్టీ కార్యాలయం చుట్టూ మోహరించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, కేంద్ర కార్యవర్గసభ్యులు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యవర్గసభ్యులు దోనేపూడి శంకర్, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు తదితరుల నేతృత్వంలో ర్యాలీగా రాజ్‌భవన్‌కు బయలుదేరగా, పెట్రోలు బంకు సమీపంలో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో సీపీఐ నాయకులు, పోలీసుల మధ్య వాగ్వాదం జరగటంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. సీపీఐ నాయకులను బలవంతంగా అరెస్టు చేసి గవర్నర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మీడియాతో మాట్లాడుతూ ఫెడరలిజాన్ని కాపాడాలని, గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలన్న డిమాండ్‌తో దేశవ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీ చలో రాజ్‌భవన్ చేపట్టినట్లు తెలిపారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రాల హక్కులను ఏమాత్రం గౌరవించటం లేదని రామకృష్ణ విమర్శించారు. రాష్ట్రాలు తీసుకునే నిర్ణయాలను కించపరుస్తున్నారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వలేదు. విభజన హామీలు అమలు చేయలేదు. మొత్తంగా రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి జగన్ ఢిల్లీ వెళ్లి అభ్యర్థిస్తున్నా ప్రధాని మోదీ ఏమాత్రం స్పందించడం లేదన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీయేతర ప్రభుత్వాలను కూల్చడమే కేంద్రం

- మిగతా 2 లో

జాతీయ రహదారిపై రన్‌వే

2లో

ఎయిర్ క్రాఫ్ట్ ట్రైల్ రన్ విజయవంతం

జాతీయ రహదారిపై నిర్మించిన ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ(ఇఎల్ఎఫ్)పై నిర్వహించిన ట్రైల్ రన్ పూర్తిస్థాయిలో విజయవంతమైందని ఎయిర్ ఫోర్స్ కమాండర్, గ్రూప్ కెప్టెన్ ఆర్ఎస్ చౌదరి ప్రకటించారు.

ఓటు కోసం ఆర్‌వీఎం

- వలస వెళ్లిన ఓటర్ల సౌకర్యార్థమే: సీఈసీ
- 16న డెమోకు రాజకీయ పార్టీలకు ఆహ్వానం

న్యూఢిల్లీ: విద్య, పని తదితర కారణాల వల్ల సొంతూళ్లు, రాష్ట్రాలను వదిలి వేర్వేరు ప్రాంతాలకు తరలిపోయే వారు భారత్‌లో చాలా ఎక్కువమంది ఉన్నారు. ఇలాంటి వారు ఎన్నికల సమయాల్లో తమ సొంతూళ్లకు వెళ్లి ఓటు వేయాల్సి ఉంటుంది. కానీ అది అందరికీ కుదరడం లేదు. ఫలితంగా చాలా మంది వలసదారులు ఓటింగ్‌కు దూరంగా ఉండాల్సి వస్తోంది. దీంతో వలసవాదుల సౌకర్యార్థం సొంతూళ్లకు

- మిగతా 2 లో

తిరుపతిలో ఫోరెన్సిక్ యూనివర్సిటీ

- విభజనాంశాల అమలుకు చర్యలు తీసుకోండి
- అమిత్ షాకు సీఎం జగన్ వినతి
- మోదీకి చెప్పిన అంశాలన్నీ మళ్లీ ప్రస్తావన

ఢిల్లీలో అమిత్‌షాతో...

విజయవాడలో సీజేఐతో...

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: తిరుపతిలో నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ(ఎన్ఎఫ్ఎస్‌యూ)ని ఏర్పాటు చేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు సీఎం జగన్ విజ్ఞప్తి చేశారు. రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా సీఎం తొలిరోజు ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర అటవీ పర్యావరణశాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌కు విన్నవించిన అంశాలను అమిత్‌షాకు వివరించారు. వాటితో పాటు తిరుపతిలో ఎన్ఎఫ్ఎస్‌యూ ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. 'ప్రపంచస్థాయి విద్య అందించేందుకు కేంద్ర ప్రభుత్వం గుజరాత్‌లోని గాంధీనగర్ కేంద్రంగా నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ ఏర్పాటు చేసింది. ఢిల్లీ, గోవా, త్రిపురలలో క్యాంపస్‌లు స్థాపించింది. జాతీయ ప్రాముఖ్యత దృష్ట్యా

- మిగతా 2 లో

ఇదీ లోకం!

నాకు 'గడప' రావడానికి ఇంకా ఎన్నేళ్లు పడుతుంది గురూజీ!

చిన్నారుల ప్రాణాలు బలిగొన్న

డాక్-1 మ్యాక్స్ తయారీకి బ్రేక్

- నోయిడాలోని మరియన్ బయోటెక్‌లో తనిఖీలు
- దగ్గు మందు నమూనాల సేకరణ
- ఆర్‌డీటీఎల్‌లో పరీక్షలు
- ఉజ్బెకిస్థాన్‌లో ఘటనపై భారత్ విచారణ
- నివేదిక వచ్చాకే తదుపరి చర్యలు : కేంద్ర ఆరోగ్యశాఖ

న్యూఢిల్లీ/నోయిడా: భారత్‌లో తయారు చేసిన దగ్గు మందు కారణంగా 18 మంది మృత్యువాత పడినట్లు ఉజ్బెకిస్థాన్ చేసిన ఆరోపణలను కేంద్రప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఆ మందు తయారీని తాత్కాలికంగా నిలిపివేసింది. అలాగే, డాక్-1 మ్యాక్స్ దగ్గు మందును తయారు చేసే ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో మరియన్ బయోటెక్ కంపెనీలో తనిఖీలు నిర్వహించింది. ఈ మేరకు కేంద్ర ఔషధాల ప్రమాణాల నియంత్రణ సంస్థ (సీడీఎస్‌సీఓ) ప్రతినిధి గురువారం తెలిపారు. కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి మన్సుఖ్ మాండవియా మాట్లాడుతూ ఫార్మా కంపెనీ తనిఖీ అనంతరం అధికారులు ఇచ్చే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. డాక్-1 మ్యాక్స్ మందును భారత్‌లో మారియన్ బయోటెక్ విక్రయించదని, ఉజ్బెకిస్థాన్‌కు మాత్రమే ఎగుమతి చేస్తుందని

- మిగతా 2 లో

బీజేపీకే భారీ విరాళాలు

- కాంగ్రెస్ కంటే 19 రెట్లు...
- ఎన్నికల ట్రస్టుల ద్వారా వచ్చే నిధులపై ఏడీఆర్ నివేదిక

న్యూఢిల్లీ: ప్రతీసారి ఎన్నికలు వస్తున్నాయంటే జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీలు డబ్బును నీళ్లలా ఖర్చు చేస్తాయి. వీటికి లెక్కా పత్రం ఉండవంటే అతిశయోక్తి కాదుగానీ ప్రజాస్వామ్య సంస్కరణల సంఘం (ఏడీఆర్) ద్వారా కాస్తంత సమాచారం అందుతుంది. ఈ సంస్థ తాజాగా విడుదల చేసిన నివేదిక ఆధారంగా బీజేపీకి విరాళాలు పోటెత్తాయని తెలుస్తోంది. 2021-22లో రాజకీయ పార్టీల ఎన్నికల ట్రస్టులకు వచ్చిన విరాళాల వివరాలను ఏడీఆర్ నివేదించింది. ప్రతిపక్ష కాంగ్రెస్‌తో పోల్చితే బీజేపీకి 19రెట్లు అధికంగా నిధులు వచ్చాయని, మిగతా తొమ్మిది పార్టీలకు వచ్చిన దానికంటే 2.5రెట్లు అధికంగా బీజేపీకి సమకూరాయని తెలిపింది. 2021-22లో రాజకీయ పార్టీలు అన్నింటికి వచ్చిన మొత్తంలో 72.12శాతం లేదా రూ.351.50 కోట్లు బీజేపీకి వచ్చాయని ఏడీఆర్ వెల్లడించింది.

మరోవైపు కాంగ్రెస్‌కు రూ.18.44 కోట్లు, టీఆర్ఎస్‌కు రూ.40కోట్లు, సమాజ్‌వాదీ పార్టీకి రూ.27కోట్లు, ఆమ్‌ఆద్మీ పార్టీకి రూ.21.12 కోట్లు, వైఎస్ఆర్ కాంగ్రెస్‌కు రూ.20 కోట్లు ఎన్నికల ట్రస్టుల ద్వారా సమకూరినట్లు ఏడీఆర్ వెల్లడించింది. అలాగే ఎస్ఏడీకి రూ.7కోట్లు, పంజాబ్ లోక్ కాంగ్రెస్‌కు రూ.కోటి, గోవా ఫార్వర్డ్ పార్టీ & డీఎంకేకు రూ.50లక్షల చొప్పున లభించినట్లు నివేదిక

- మిగతా 2 లో

'బ్లాక్ సీ గ్రెయిన్' సమన్వయకర్త అబ్దుల్లా : ఐరాస

ఐరాస: కువైత్‌కు చెందిన అబ్దుల్లా సమద్ దాష్టీని ఐరాస-ట్రోకర్డ్ బ్లాక్ సీ గ్రెయిన్ ఇనిషియేటివ్ నూతన సమన్వయకర్తగా, ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమాల (యూఎన్‌ఈపీ) డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా టాంజానియాకు చెందిన ఎలిజబెత్ మరుమా మ్రేమాను ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ నియమించారు. ఈమేరకు ఐరాస అధికార ప్రతినిధి స్టిఫనే దుజారిక్ వెల్లడించారు.ఎలిజబెత్ మ్రేమా 2020 నుంచి కెనడా, మాంట్రియల్‌లో ఐరాస జీవవైవిధ్య సదస్సు సెక్రటేరియట్ ఎగ్జిక్యూటివ్ కార్యదర్శిగా ఉన్నారు. ఆమె 1994లో యూఎన్‌ఈపీలో చేరారు. అంతకుముందు టాంజానియా విదేశాంగశాఖలో పనిచేశారు. కాగా అబ్దుల్లా సమద్ దాష్టీ 2021లో కువైతీ సాయుధ దళాల వైస్ అడ్మిరల్‌గా పదవీ విరమణ పొందారు. ఆయనకు నావికా దళంలో 40ఏళ్ల అనుభవం ఉంది. కువైత్‌తో పాటు బహుళ జాతీయ నియామకాలూ చేపట్టారు. నాటోకు కువైట్ ప్రతినిధిగా వ్యవహరించారు.

బ్రహ్మోస్ ప్రయోగం విజయవంతం

న్యూఢిల్లీ: బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రూయిజ్ ఎక్స్‌టెండెడ్ రేంజ్ వెర్షన్‌ను గురువారం సుఖోయ్-30ఎంకేఐ యుద్ధ విమానం నుంచి భారత్ విజయవంతంగా ప్రయోగించింది. ఈ క్షిపణి బంగాళాఖాతంలోని నిర్దేశిత లక్ష్యాన్ని నేరుగా తాకింది. ఈ ప్రయోగంతో భూమి/సముద్రంలోని సుదూర లక్ష్యాలపై కచ్చితమైన దాడుల సామర్థ్యాన్ని వాయుసేన సాధించిందని రక్షణశాఖ వెల్లడించింది. బ్రహ్మోస్ సామర్థ్యం, సుఖోయ్-30ఎంకేఐ పనితీరు భారత వైమానిక దళానికి వ్యూహాత్మక బలాన్నిస్తున్నట్లు తెలిపింది. భవిష్యత్తులో యుద్ధక్షేత్రాలలో భారత్ ఆధిపత్యం చలాయించడానికి ఇవి దోహదమవుతాయని పేర్కొంది. వాయుసేన, నావికా దళం, డీఆర్డీఓ, హిందుస్థాన్ ఏరోనాటికల్ లిమిటెడ్, బ్రహ్మోస్ ఏరోస్పేస్ సంయుక్త భాగస్వామ్యంతో ఈ ప్రయోగం విజయవంతమైందని ఐఏఎఫ్ తెలిపింది. ప్రయోగానికి సంబంధించిన దృశ్యాలను ట్వీట్ చేసింది. అయితే ఈ క్షిపణి ప్రయోగం ఇదే తొలిసారి కాదు. మేలోనూ ఇలాంటి పరీక్ష జరిగింది. భారత్, రష్యా సంయుక్త ప్రాజెక్టు 'బ్రహ్మోస్ ఏరోస్పేస్' ద్వారా సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణులను ఉత్పత్తి చేస్తున్నారు. ధ్వని కంటే మూడు రెట్ల అధిక వేగంతో ఈ క్షిపణలు దూసుకెళ్లగలవు.

113 ఉల్లంఘనలు రాహుల్‌వే
భద్రతా ప్రొటోకాల్‌పై కేంద్రం

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్వయంగా 113 సార్లు భద్రతా ప్రొటోకాల్‌ను ఉల్లంఘించినట్లు కేంద్రప్రభుత్వ అధికారులు వెల్లడించారు. రాహుల్‌కు భద్రత విషయంలో కాంగ్రెస్ వ్యక్తంచేసిన ఆందోళనలను తోసిపుచ్చారు. ఆయనకు తగిన భద్రత కల్పిస్తున్నట్లు తెలిపారు. 2020 నుంచి 113సార్లు భద్రతా నిబంధనలను రాహుల్ అతిక్రమించినట్లు వెల్లడించారు. దేశ రాజధానిలో భారత్ జోడో యాత్ర సాగే క్రమంలో భద్రతా అతిక్రమణలు జరిగినట్లు తెలుపుతూ కాంగ్రెస్ పార్టీ బుధవారం హోంమంత్రి అమిత్‌షాకు లేఖ రాసింది. రాహుల్ గాంధీకి తగిన భద్రత కల్పించాలని కోరింది. దీనిపై అధికారులు గురువారం స్పందించారు. మార్గదర్శకాల ప్రకారం సరిపడ భద్రతా ఏర్పాట్లు చేశామని చెప్పారు. మార్గదర్శకాల ప్రకారం సహకరిస్తేనే రాహుల్‌కు రక్షణ ఉంటుందన్నారు. ఆయన భద్రతా నిబంధనలు, సీఆర్‌పీఎఫ్‌ను పట్టించుకోలేదని అధికారులు అన్నారు. ఢిల్లీలో యాత్రలో భద్రతా ఉల్లంఘనలను హోంమంత్రి దృష్టికి కాంగ్రెస్ తీసుకెళ్లింది. వచ్చిన జనాన్ని ఢిల్లీ పోలీసులు నియంత్రించలేకపోయినట్లు అమిత్‌షాకు రాసిన లేఖలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పేర్కొన్నారు. కక్షసాధింపు రాజకీయాలు తగవని.. కాంగ్రెస్ నేతల భద్రతకు హామీనివ్వాలన్నారు. యాత్ర క్యాంపులోకి అక్రమంగా చొరబడిన వారు హరియాణా ఇంటెలిజెన్స్ భద్రతా సిబ్బందని, యాత్రలో పాల్గొన్న వారిని విచారించారని వేణుగోపాల్ వెల్లడించారు. 'శనివారం ఢిల్లీలో యాత్ర క్రమంలో అనేకమార్లు భద్రతా ఉల్లంఘనలు జరిగాయి. పోలీసులు వచ్చిన జనాన్ని అదుపు చేయలేకపోవడంతో యాత్రికులు, కాంగ్రెస్ వర్కర్లు రంగంలోకి దిగక తప్పలేదు. పంజాబ్, జమ్ముకశ్మీర్ వంటి సున్నిత రాష్ట్రాల్లోకి యాత్ర ప్రవేశించనున్న క్రమంలో మెరుగైన భద్రత కల్పించాలి' అని కేంద్ర హోంమంత్రిని వేణుగోపాల్ కోరారు. రాహుల్ గాంధీకి ప్రస్తుతం జెడ్ ప్లస్ భద్రత ఉంది. కాగా, భారత్‌జోడో యాత్ర ఢిల్లీలో తొమ్మిది రోజుల విరామం తర్వాత జనవరి 3 నుంచి తిరిగి ప్రారంభమవుతుంది.

అమిత్‌షా కోసమే అసెంబ్లీ నిరవధిక వాయిదా
తర్వాత రమ్మని చెప్పేంత ధైర్యం బొమ్మైకు లేదు : సిద్ధరామయ్య



బెళగావి: కర్ణాటక అసెంబ్లీ శీతాకాల సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. షెడ్యూల్ ప్రకారం ఈనెల 30వ తేదీ వరకు సమావేశాలు జరగాల్సి ఉండగా గురువారంతో సభ ముగుస్తున్నట్లు సభాపతి బుధవారం ప్రకటించారు. కేవలం కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాష్ట్రపర్యటనను పురస్కరించుకొని అసెంబ్లీ సమావేశాలను ఒక రోజు ముందే ముగించేశారని ప్రతిపక్ష నాయకుడు సిద్ధరామయ్య విమర్శించారు. ప్రజా సమస్యల చర్చకు 15 రోజులు కూడా సరిపోవని, శీతాకాల సమావేశాలను మరో వారం పొడిగించాలని డిమాండ్ చేశారు. శాసనసభ జరిగే సమయంలో రావద్దని అమిత్‌షాకు చెప్పేంత ధైర్యం సీఎం బసవరాజ్ బొమ్మైకు లేదని విమర్శించారు. అమిత్‌షాకు మొకరిల్లేందుకు ఇలాంటి చర్యలు తీసుకోవడం రాష్ట్రానికి వ్యతిరేకమన్నారు. దీనినిబట్టి కర్ణాటకలోని బీజేపీ ప్రభుత్వానికి ప్రజల పట్ల ఎంత చిత్తశుద్ధి ఉన్నదో అర్థమవుతోందని వ్యాఖ్యానించారు. 'అమిత్‌షా వస్తారు... వెళతారు. ఆయన కోసం శాసనసభను నిరవధికంగా వాయిదా వేయవచ్చా? అమిత్‌షా కార్యక్రమానికి వెళ్లాలనుకునే వారిని వెళ్లనివ్వండి. అసెంబ్లీని యథావిధిగా జరగనివ్వండి. ఎలాగో స్పీకర్ వెళ్లరు. నేను ముఖ్యమంత్రిని... శాసనసభ జరిగేటప్పుడు రాష్ట్రానికి రావద్దు.. తర్వాత రండి అని బొమ్మై చెప్పి ఉండాల్సింది. ఆయనకు అంత ధైర్యం లేదు కదా!' అని సిద్ధరామయ్య వ్యాఖ్యానించారు. శుక్రవారం విజయపురాలో కృష్ణ యోజన సమావేశ నిర్వహణపై విలేకరుల ప్రశ్నకు స్పందిస్తూ అసెంబ్లీ కార్యకలాపాల్లో పాల్గొనేందుకు చాపర్ వినియోగించాలని అనుకున్నామని ఆయన చెప్పారు. కాగా, ఈనెల 19 నుంచి 30వ తేదీ వరకు జరగాల్సిన అసెంబ్లీ గురువారం ముగిసింది. 30,31 తేదీల్లో మాండ్యా, దేవన్‌హళ్లి, బెంగళూరులో జరిగే పార్టీ సమావేశాలతో పాటు వేర్వేరు కార్యక్రమాల్లో అమిత్‌షా పాల్గొనున్నారు.

మెక్సికో కమ్యూనిస్టు పార్టీ మొదటి కార్యదర్శిగా
పావెల్ బ్లాంకో మళ్లీ ఎన్నిక

మెక్సికో: మెక్సికో కమ్యూనిస్టు పార్టీ (పీసీఎం) మొదటి కార్యదర్శిగా పావెల్ బ్లాంకో తిరిగి ఎన్నిక కాగా రెండవ కార్యదర్శిగా డీయగో టర్రోస్ ఎన్నికయ్యారు. ఎల్ మాచేటే వార్తాపత్రిక డైరెక్టర్‌గా ఏంజిల్ చావెజ్ నియమితులయ్యారు. ఈనెల 16,17, 18 తేదీల్లో జరిగిన పార్టీ ఏడవ మహాసభలో భాగంగా 14 మందితో పొలిటికల్ బ్యూరోను కొత్త కేంద్ర కమిటీ ఎన్నుకున్నది. 176 పార్టీల ప్రతినిధులు, 30 మంది కమ్యూనిస్టు యువనాయకులు హాజరయ్యారు. క్యూబా, గ్రీస్, స్పెయిన్, పెరూ, బ్రెజిల్ దేశాల కమ్యూనిస్టు పార్టీలతో పాటు అనేక కార్మిక సంఘాలు, మెక్సికో, లాటిన్ అమెరికా ఉద్యమనాయకులూ పాల్గొన్నారు. క్యూబా-మెక్సికో కమ్యూనిస్టు జులియో ఆంటోనియో మెల్లాకు పీసీఎం మహాసభ ఘనంగా నివాళులర్పించింది. సోవియట్ యూనియన్‌కు వందేళ్లు అయిన సందర్భంగా అంతర్జాతీయ సదస్సును 'ది యూఎస్ఎస్ఆర్, సోషలిస్ట్ నిర్మాణం, కమ్యూనిస్టుల వ్యూహం' పేరిట నిర్వహించింది. సామాజిక, ప్రజాస్వామ్య, వామపక్ష దళాల ఐక్యకు మెక్సికో కమ్యూనిస్టు పార్టీ పునరుద్ఘాటించింది. పెట్టుబడిదారీ పాలన అంతానికి పిలుపునిచ్చింది. ఒబ్రేడార్ ప్రభుత్వం ప్రజా-కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తోందని దుయ్యబట్టింది. అన్ని ఖండాల నుంచి 38 కమ్యూనిస్టు, వర్కర్ల పార్టీలవారు హాజరై మార్క్సిస్టు లెనినిస్టు సంఘాలతో పాటు పార్టీ రాజకీయ సంసిద్ధత, సైద్ధాంతిక, కార్మిక వర్గ పోరాటాలు, విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలు, మహిళలు, వలసవాదుల కష్టాలు, స్థానికుల వెతలు వంటి అంశాలను చర్చించారు. అన్ని వర్గాలకు అండగా నిలవడమే కాకుండా వారి సమస్యల పరిష్కారానికి మరింత ఉధృతంగా ప్రజా పోరాటాలకు సంసిద్ధం కావాలని ఏకగ్రీవంగా తీర్మానించారు.

మహిళా ఎన్జీవోలపై ఆంక్షలొద్దు
తాలిబన్లకు ఈయూ సహా 12 దేశాల వినతి

మాస్కో: అఫ్గాన్‌లో తాలిబన్ల ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటి నుంచి ఆ దేశంలో మహిళలు అణచివేతకు గురవుతున్నారు. ఇంటి నుంచి బయటకు రాలేని దీనస్థితిని అనుభవిస్తున్నారు. వారిపై అనేక ఆంక్షలు విధించిన తాలిబన్లు తాజాగా విద్యనూ దూరం చేసింది. యూనివర్సిటీలో మహిళల విద్యాభ్యాసానికి అడ్డుకట్ట వేసింది. దీంతో బాగా చదువుకొని ఉజ్వల భవిష్యత్‌ను ఊహించుకున్న యువతులు తల్లడిల్లిపోయారు. ఈ పరిస్థితుల్లో తాలిబన్ల చర్యకు వ్యతిరేక పెరుగుతోంది. ప్రపంచ దేశాలు సైతం ఖండిస్తున్నాయి. తాజాగా మహిళల కోసం పనిచేసే ఎన్జీవోలపై ఆంక్షలు ఎత్తివేయాలని యూరోపియన్ యూనియన్‌తో సహా 12 దేశాలు కోరాయి. వీటిలో ఆస్ట్రేలియా, కెనడా, డెన్మార్క్ ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, నార్వే, స్విట్జర్లాండ్, నెదర్లాండ్స్, బ్రిటన్, అమెరికా దేశాలుఉన్నాయి. ఆయా దేశాల విదేశాంగ మంత్రులు స్పందిస్తూ తక్షణమే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని అఫ్గాన్ ప్రభుత్వానికి సూచించారు. మానవతా, కనీస అవసరాల సంఘాల్లో మహిళా వర్కర్లది ప్రధాన పాత్రని, ఎన్జీవోలలో మహిళా వర్కర్లు లేకుండా అణగారిన వర్గాలకు సాయం అందడం కష్టమవుతుందని అన్నారు. అంతర్జాతీయ సంఘాలు అందించే ఆహారం, మందులు, తదితరాలు అవసరార్థులకు చేరాలంటే ఎన్జీవోల్లో మహిళలు ఉండాల్సిందేనని నొక్కిచెప్పారు.

జాతీయ రహదారిపై రన్‌వే

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు/బాపట్ల: జాతీయ రహదారిపై నిర్మించిన ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ(ఇఎల్ఎఫ్)పై నిర్వహించిన ట్రైల్ రన్ పూర్తిస్థాయిలో విజయవంతమైందని ఎయిర్ ఫోర్స్ కమాండర్, గ్రూప్ కెప్టెన్ ఆర్ఎస్ చౌదరి ప్రకటించారు. బాపట్ల జిల్లా, అద్దంకి సమీపంలోని కొరిశపాడు మండలం పిచ్చుకలగుడిపాడు-రేణంగివరం గ్రామాల వద్ద 16వ నెంబరు జాతీయ రహదారిపై 4.1 కి.మీ పొడవున, 33 మీటర్ల వెడల్పుతో కాంక్రీట్ ఎయిర్‌స్ట్రిప్‌ను నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్మించింది. నిర్మాణ పనులు ముగింపు దశకు చేరడంతో భారత వాయు సేన అధికారులు నాలుగు ఫైటర్ ఎయిర్ క్రాఫ్ట్‌లు, ఒక ట్రాన్స్ పోర్ట్ ఎయిర్ క్రాఫ్ట్‌లతో గురువారం ట్రైల్ రన్ నిర్వహించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన రాడర్ల ద్వారా వచ్చే సంకేతాల ఆధారంగా ఇఎల్ఎఫ్ నుంచి కార్యకలాపాల సాధ్యాసాధ్యాలను తనిఖీ చేస్తూ సదరన్ ఎయిర్ కమాండ్ నుండి ఎప్పటికప్పుడు అంచనాలు వేసుకుంటూ ఐఏఎఫ్ విమానం స్ట్రిప్‌పై ఓవర్‌షూట్‌లను వాయిసేన అధికారులు, సైనికులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య ట్రైల్ రన్ దిగ్విజయంగా చేపట్టారు. ఐదడుగుల ఎత్తులో ఫైటర్ ఎయిర్ క్రాఫ్ట్‌లు చక్కర్లు కొట్టడం, సురక్షితంగా గమ్యస్థానానికి చేరడంతో వాయిసేన అధికారులు ప్రక్రియను ముగించారు. ఈ దృశ్యాలను చూసేందుకు గ్రామ ప్రజలు ఎంతగానో ఆసక్తి చూపారు. జాతీయ రహదారిపై భారీ వాహనాలను మాత్రమే నిలిపివేసి, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా మిగిలిన వాటిని ప్రత్యామ్నాయ మార్గాలలో పంపి వేశారు. అత్యవసర పరిస్థితులలో ఎయిర్ క్రాఫ్ట్‌లు జాతీయ రహదారిపై నిలిపేందుకు ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ సిద్ధంగా ఉందని గ్రూప్ కెప్టెన్ ఆర్ఎస్ చౌదరి తెలిపారు. ప్రస్తుతం ఇఎల్ఎఫ్ ల్యాండింగ్‌ను సులభతరం చేయడానికి పూర్తిగా సిద్ధంగా లేదన్నారు. సాధ్యాసాధ్యాలను ఐఏఎఫ్ నిర్ధారించిన తర్వాత ఇఎల్ఎఫ్ పూర్తిగా సిద్ధమైతే విమానాల ల్యాండింగ్ కోసం ప్రక్రియ చేపడతామన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రెండు ఇఎల్ఎఫ్‌లు ఎన్‌హెచ్- 6 పై పూర్తవుతున్నాయన్నారు. బాపట్ల జిల్లాలోని అద్దంకి సమీపంలో రూపొదిద్దుకున్న ఈ ఇఎల్ఎఫ్ దక్షిణ భారతదేశంలో మొట్టమొదటిసారిగా పనిచేయనుందని ప్రకటించారు. బాపట్ల-నెల్లూరు జిల్లాల మధ్య రెండు ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీలు తయారవుతున్నాయని చెప్పారు. దేశవ్యాప్తంగా ఏపీ, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, ఒడిశా, జమ్ముకశ్మీర్ రాష్ట్రాలలో ఈఎల్ఎఫ్ ఎయిర్‌స్ట్రిప్‌లను ఏర్పాటు చేస్తున్నారని వివరించారు. అలాంటి రెండు ఎయిర్‌స్ట్రిప్‌లు ఇప్పటికే యూపీ, రాజస్థాన్‌లలో పనిచేస్తున్నాయన్నారు. సూర్యలంక ఎయిర్ ఫోర్స్ స్టేషన్ ఇఎల్ఎఫ్ నుంచి సమీప ఐఏఎఫ్ వైమానిక స్థావరం కొరకు అవసరమైనప్పుడు జిల్లా పరిపాలన, రాష్ట్ర పోలీసులతో సమన్వయం చేసుకుని ఎయిర్ స్ట్రిప్ ప్రక్రియ చేయడానికి వీలు కలుగుతుందని గ్రూప్ కెప్టెన్ చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో హైవే స్ట్రెచ్‌లు బ్లాక్ చేయాల్సి ఉంటుందని, ఎన్‌హెచ్ఏఐ అధికారుల సహకారంతో విమానాల ల్యాండింగ్ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. వ్యూహాత్మక ప్రయోజనాల కోసం, ప్రకృతి వైపరీత్యాల సమయంలో రెస్క్యూ, రిలీఫ్ ఆపరేషన్‌ల కోసం ఎయిర్‌స్ట్రిప్‌లను ఉపయోగించవచ్చన్నారు. రోడ్డు లేదా రైలు మార్గాల్లో అంతరాయం ఏర్పడినప్పుడు విమానాలను నడపడానికి, అత్యవసర సమయంలో మనుషులు, సామగ్రిని తరలించడానికి వివిధ రాష్ట్రాల్లోని జాతీయ రహదారులపై ఎయిర్‌స్ట్రిప్‌లను అభివృద్ధి చేయాలని 2018లో కేంద్రం నిర్ణయించిందన్నారు. బాపట్ల జిల్లా పరిధిలోని జాతీయ రహదారిపై నిర్మించిన ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీపై ఎయిర్ క్రాఫ్ట్ దిగడానికి సిద్ధమని జిల్లా కలెక్టర్ కె.విజయ కృష్ణన్ వెల్లడించారు. వాయిసేన అధికారులు నిర్వహించిన ట్రైల్ రన్‌లో ఎలాంటి లోపాలు తలెత్తలేదని స్పష్టం చేశారు. తొలిసారిగా నాలుగు ఫైటర్ ఎయిర్ క్రాఫ్ట్‌లు, ఒకటి ట్రాన్స్‌పోర్ట్ ఎయిర్ క్రాఫ్ట్ రహదారిపై దిగడానికి సాధ్యాసాధ్యాలను వాయుసేన అధికారులు పరిశీలించారన్నారు. దేశంలోని 20 ప్రాంతాల్లో జాతీయ రహదారిపై ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీలను కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తుండగా ఇప్పటికీ రెండు ప్రారంభమయ్యాయి. కాగా మూడోది బాపట్ల జిల్లాలోనే పూర్తయిందన్నారు. భవిష్యత్తులో అత్యవసర పరిస్థితి మేరకు జాతీయ రహదారుల అథారిటీ, కేంద్ర ప్రభుత్వం, వాయిసేన సంయుక్తంగా ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ ప్రారంభించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారని తెలిపారు. దక్షిణ భారతదేశంలో బాపట్ల జిల్లా మొదటిగా నర్మద ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీగా ప్రారంభం కానుందని చెప్పారు. అరుదైన అవకాశం బాపట్ల జిల్లాకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఎలాంటి అవాంతరాలు ఏర్పడకుండా సమర్థంగా ట్రైన్ రన్ నిర్వహించడం అభినందనీయమన్నారు. వాయిసేన అధికారి వి.ఎం.రెడ్డి, ప్రకాశం జిల్లా కలెక్టర్ కె ఎస్ దినేశ్ కుమార్, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, జిల్లా సంయుక్త కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు, వాయిసేన అధికారులు పాల్గొన్నారు.

తిరుపతిలో ఫోరెన్సిక్ యూనివర్సిటీ

(మొదటిపేజీ తరువాయి)

ఫోరెన్సిక్ సైన్స్, క్రైమ్ ఇన్వెస్టిగేషన్, సెక్యూరిటీ బిహేవియరల్ సైన్స్, క్రిమినాలజీ రంగాల్లో పరిశోధనలు నిర్వహిస్తూ ఫోరెన్సిక్ నిపుణుల కోసం డిమాండ్ పెరుగుతోంది. దీనికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా క్రిమినల్ జస్టిస్ ఇనిస్టిట్యూట్‌ల బలోపేతంపై దృష్టి పెట్టింది.ఈ నేపథ్యంలో దక్షిణ భారతదేశంలో ఫోరెన్సిక్ రంగంలో సేవలందించే అటువంటి సంస్థ లేని లోటు, దానిని ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉంది' అని సీఎం జగన్ కేంద్ర మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అందులో భాగంగా ఇప్పటికే ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా ఉంటూ విద్యారంగంలోనూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తిరుపతిలో నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలని కోరారు. ఈ యూనివర్సిటీ ఏర్పాటుకు అవసరమైన భూమిని ఉచితంగా అందించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలియజేశారు. ప్రపంచవ్యాప్తంగా కోవిడ్ తాజా పరిణామాల నేపథ్యంలో ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉన్నామని తెలిపారు. రాష్ట్ర విభజన జరిగి 8 ఏళ్లు గడిచినప్పటికీ విభజన చట్టంలో పేర్కొన్న అంశాల్లో చాలావరకు ఇప్పటికీ నెరవేర్చలేదని, రెండు రాష్ట్రాల మధ్య ఇంకా కీలక అంశాలు పరిష్కారం కాలేదని వివరించారు. ముఖ్యంగా 2014-15 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రిసోర్స్ గ్యాప్ ఫండింగ్ కింద చెల్లించాల్సిన రూ.18,330.45 కోట్ల బకాయిలు అలానే ఉన్నాయని, ఇవిగాక 10వ వేతనసంఘం బకాయిలు, పెన్షన్లు మొదలైన వాటి రూపేణా మొత్తం రూ.32,625.25 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని వెంటనే మంజూరు చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తన సొంత నిధుల నుంచి ఖర్చు చేసిన రూ.2,937.92 కోట్ల రూపాయలను, తెలంగాణ డిస్కంల నుంచి రావాల్సిన రూ.6,886 కోట్ల కరెంటు బకాయిలను వెంటనే ఇప్పించాలని కోరారు. జాతీయ ఆహార భద్రతా చట్టంలో నిబంధనలు హేతుబద్ధంగా లేవని, దీనివల్ల రాష్ట్రానికి తీవ్రనష్టం వాటిల్లుతోందని తెలిపారు. రాష్ట్రంలో అర్హత ఉన్న 56 లక్షల కుటుంబాలు పీఎంజీకేఏవై కింద లబ్ధి పొందడం లేదని, నెలకు సుమారు 3 లక్షల టన్నుల రేషన్ బియ్యం కేంద్రం వద్ద మిగిలిపోతున్నాయని, ఇందులో 77 వేల టన్నులు రాష్ట్రానికి కేటాయిస్తే అర్హులందరికీ ఆహార భద్రతాచట్టం వర్తింపు చేసినట్టువుతుందని, వీటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అమిత్‌షాకు విజ్ఞప్తి చేశారు.

సీజేఐ చంద్రచూడ్‌తో సీఎం జగన్ భేటీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : మూడు రోజుల తిరుపతి జిల్లా పర్యటన ముగించుకుని గురువారం విజయవాడకు చేరుకున్న భారత ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్‌ను ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం వివిధ కార్యక్రమాల్లో పాల్గొనే క్రమంలో విజయవాడ నోవాటెల్ హోటల్‌కు చేరుకున్న సీజేఐ చంద్రచూడ్‌ను సీఎం జగన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీ వెంకటేశ్వర స్వామి ప్రతిమను సీజేఐకి ముఖ్యమంత్రి అందచేశారు. తిరుపతిలో సీజేఐకి వీడ్కోలు పలికిన వారిలో రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఏపీ హైకోర్టు లక్ష్మణరావు, టీటీడీ చైర్మన్ వై వి సుబ్బారెడ్డి జిల్లా కలెక్టర్ కె వెంకటరమణ రెడ్డి, ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, మూడవ అడిషనల్ జిల్లా జడ్జి వీర్రాజు, ప్రోటోకాల్ మేజిస్ట్రేట్ కోటేశ్వరరావు తదితరులున్నారు.

బీజేపీకే భారీ విరాళాలు

(మొదటిపేజీ తరువాయి)

తెలిపింది. 2021-22లో కార్పొరేట్లు, వ్యక్తుల నుంచి మొత్తం రూ.487.09 కోట్లు ఎలక్టోరల్ ట్రస్టులకు సమకూరగా అందులో నుంచి 99.99శాతం అంటే రూ.486.06 కోట్లు వివిధ పార్టీలకు ఇచ్చినట్లు ఏడీఆర్ పేర్కొంది. 2021-22లో ఎలక్టోరల్ ట్రస్టుకు రూ.475.80కోట్లు 89 కార్పొరేట్/వ్యాపార సంస్థల ద్వారా సమకూర్చాయి. ప్రూడెంట్ ఎలక్టోరల్ ట్రస్టుకు రూ.456.30 కోట్లు, ఏబీ సాధారణ ఎన్నికల ట్రస్టుకు ఇద్దరు కార్పొరేట్లు రూ.10.00కోట్లు ఇవ్వగా ముగ్గురు కార్పొరేట్లు రూ.5 కోట్లు సమాజ్ ఎన్నికల ట్రస్టుకు ఇచ్చారు. 15 మంది కార్పొరేట్లు రూ.2.20 కోట్లను స్వతంత్ర ఎన్నికల ట్రస్టుకు సమకూర్చారు. 40మంది వ్యక్తులు విరాళాలు ఇవ్వగా ఇందులో 13మంది ప్రూడెంట్ ఎన్నికల ట్రస్టుకు రూ.8.53 కోట్లు ఇవ్వగా 15 మంది రూ.2.61 కోట్లను స్వతంత్ర ఎన్నికల ట్రస్టుకు ఇచ్చారు. చిరుమొత్తాల ఎన్నికల ట్రస్టుకు రూ.14.34లక్షలను 12 మంది ఇచ్చారు. ఎన్నికల ట్రస్టులకు అధికంగా రూ.70 కోట్లు విరాళమిచ్చిన సంస్థగా ఆర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ లిమిటెడ్ నిలిచింది. తర్వాత స్థానంలో రూ.60 కోట్లతో ఆర్సెలర్ మిట్టల్ డిజైన్, ఇంజినీరింగ్ సెంటర్ ప్రైవేట్ ఉండగా రూ.51 కోట్లను వివిధ ట్రస్టులకు భారతీ ఎయిర్‌టెల్ లిమిటెడ్ సమకూర్చినట్లు ఏడీఆర్ నివేదిక తెలిపింది.

చలో రాజ్‌భవన్ ఉద్రిక్తం

(మొదటిపేజీ తరువాయి)

పనిగా పెట్టుకుందని, ఫిరాయింపులు ప్రోత్సహిస్తున్నదని చెప్పారు. చట్టసభల్లో మెజార్టీ లేకపోయినా బీజేపీని అధికారంలోకి తీసుకువస్తున్నదన్నారు. ఫిరాయింపుల ద్వారా తొమ్మిది రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాలు ఏర్పడ్డాయని చెబుతూ ఆయా రాష్ట్రాల్లో బీజేపీ నిర్వహించిన అనైతిక, అప్రజాస్వామిక చర్యలను వివరించారు. ఇలాంటి కార్యక్రమాల నిర్వహణకు బీజేపీ పెద్దలు గవర్నర్ వ్యవస్థను నిస్సిగ్గుగా వినియోగించుకుంటున్నారని చెప్పారు. తెలంగాణ, తమిళనాడు, కేరళ, పశ్చిమబెంగాల్ వంటి అన్ని రాష్ట్రాల్లో గవర్నర్ వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్న ఘటనలను ఉదహరించారు. ప్రజల చేత ఎన్నికైన ప్రభుత్వాలను బెదిరించే స్థాయికి గవర్నర్లు దిగజారారని, ఈ నేపథ్యంలోనే గవర్నర్ వ్యవస్థను రద్దు చేయటం, ఫెడరలిజం వ్యవస్థను రక్షించటం, రాష్ట్రాల హక్కులను గౌరవించటం మొత్తంగా రాజ్యాంగాన్ని కాపాడాలనే ఉద్దేశంతో చలో రాజ్‌భవన్ చేపట్టినట్లు రామకృష్ణ తెలిపారు. భవిష్యత్తులోనూ ఈ ఉద్యమాన్ని కొనసాగిస్తామని, దీనికి ప్రజాస్వామిక వాదులు ముందుకు వచ్చి మద్దతివ్వాలని కోరారు. కేంద్రం తన తీరు మార్చుకోవాలని, సమాఖ్య వ్యవస్థకు తూట్లు పొడిచే చర్యలకు స్వస్తి చెప్పాలని డిమాండ్ చేశారు. దోనేపూడి శంకర్ మాట్లాడుతూ మేధావులు, ఏదైనా రంగంలో నిష్ణాతులను గవర్నర్లుగా నియమించాలని డిమాండ్ చేశారు. కానీ రాజకీయ నిరుద్యోగులను గవర్నర్లుగా నియమిస్తున్నారని, వారి ద్వారా రాజకీయ ప్రత్యర్థులను దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. పోలీసు వ్యవస్థ సరిగా లేదని, వారి తీరు మారాలన్నారు. లేనిపక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన గవర్నర్ వ్యవస్థ అసలు సిసలు రాజకీయ వ్యవస్థగా మారిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిరపర్చటం ద్వారా తన రాజకీయ విధానాలను, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలను అమలు పర్చేలా గవర్నర్ వ్యవస్థ ఉందన్నారు. రాజ్యాంగానికి తూట్లు పొడిచే గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఫెడరల్ ప్రభుత్వాలను రక్షించాలని కోరారు. అరెస్టు అయిన వారిలో కె.రామకృష్ణ, అక్కినేని వనజ, దోనేపూడి శంకర్, జి.కోటేశ్వరరావు, సీపీఐ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, నగర కార్యదర్శివర్గ సభ్యులు పంచదార్ల దుర్గాంబ, కార్యవర్గ సభ్యులు కొట్టు రమణరావు, దుగ్గిరాల సీతారావమ్మ, ప్రజానాట్య మండలి నగర అధ్యక్షుడు ఎస్‌కే నజీర్, కార్యదర్శి దోనేపూడి సూరిబాబు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు లంకా గోవిందరాజులు, 6వ డివిజన్ కార్యదర్శి పడాల కనకారావు, 30వ డివిజన్ కార్యదర్శి ఎం.రవికుమార్, మహిళా సమాఖ్య నగర అధ్యక్షులు ఓర్సు భారతి, నాయకులు తమ్మిన దుర్గ, నీలాపు భాగ్యలక్ష్మి ఉన్నారు.

ఓటు కోసం ఆర్‌వీఎం

(మొదటిపేజీ తరువాయి)

వెళ్లాల్సిన అవసరం లేకుండా వారెక్కడ ఉంటే అక్కడే ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా రిమోట్ ఓటింగ్ మెషిన్ (ఆర్‌వీఎం)కు ఎన్నికల కమిషన్ శ్రీకారం చుట్టింది. దీని పనితీరును పరిశీలించేందుకు అన్ని రాజకీయ పార్టీలను జనవరి 16వ తేదీన ఆహ్వానించింది. భాగస్వాములతో సంప్రదింపులు జరిపిన తర్వాతే ఈ యాంత్రాన్ని తయారు చేసినట్లు ఈసీ గురువారం అధికారికంగా ప్రకటించింది. రిమోట్ బూత్లలో పోలింగ్, వాటిని ఇతర రాష్ట్రాల్లోని రిటర్నింగ్ అధికారులకు చేర్చడం సాంకేతికపరమైన సవాల్‌గా మారిందని ఎన్నికల కమిషన్ అధికారులు తెలిపారు. ప్రస్తుతమున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం)ల కంటే సమర్థంగా కచ్చితత్వంతో పనిచేసే యంత్రాలు ఆర్‌వీఎంలని అన్నారు. ఇంటర్నెట్ అక్కర్లేదని కూడా చెప్పారు. అందరి సలహాలు, సూచనలు తీసుకొని అవసరమైతే మార్పులు చేసి రిమోట్ ఓటింగ్ ప్రక్రియను అమలు చేయాలని ఈసీ భావిస్తున్నట్లు ప్రకటన తెలిపింది. రిమోట్ ఓటింగ్ అమలులో ఎదరయ్యే న్యాయపరమైన, సాంకేతికపరమైన సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించడం ముఖ్యమని, ఇందుకోసం రాజకీయ పార్టీల అభిప్రాయాలను కోరినట్లు వెల్లడించింది. ఒక రిమోట్ పోలింగ్ బూత్ నుంచి 72 నియోజకవర్గాల ఓటింగ్ జరిగేందుకు వీలు ఉంటుంది. రిమోట్ ఓటింగ్ ఓ సంస్కరణాత్మక చర్య అని, ఎన్నికల ప్రజాస్వామ్యంలో భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తుందని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) రాజీవ్ కుమార్ అన్నారు. సాంకేతికపరమైన పరిష్కారాల కోసం భాగస్వాముల సూచనలు అవసరమని చెప్పారు. ఎన్నికల కమిషనర్లు అనూప్ చంద్ర పాండే, అరుణ్ గోయల్‌తో కలిసి ఎం3 (మార్క్3) ఈవీఎంలను రిమోట్ పోలింగ్ స్టేషన్లలో వినియోగించే విషయాన్ని అన్వేషించారు. రిమోట్ ఓటింగ్ విధానం అమల్లోకి వస్తే వలసవాదుల కోసం గొప్ప సంస్కరణే అవుతుందని ఈసీ తెలిపింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో 67.4 శాతం పోలింగ్ నమోదు కాగా దాదాపు 30 కోట్లకుపైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోలేదు. ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లినవారు ఎన్నికల వేళ స్వస్థలాలకు చేరుకొని ఓటు వేయలేక పోవడమే ఇందుకు ప్రధాన కారణం. విద్య, ఉద్యోగం, పెళ్లి ఇలా అనేక కారణాలతో చాలా మంది కొత్త ప్రాంతాలకు వెళ్లి స్థిరపడతారు. దేశంలో దాదాపు 85శాతం మంది ఇలాంటి వారే ఉన్నారు అని ఈసీ తెలిపింది.

ఇదిలావుంటే, దేశంలో గుర్తింపు పొందిన ఎనిమిది జాతీయ పార్టీలతో పాటు 57 రాష్ట్ర పార్టీలను డెమో కోసం ఆహ్వానించినట్లు ఈసీ వెల్లడించింది. రిమోట్ ఓటింగ్ ప్రదర్శన జనవరి 16న జరుగుతుందని తెలిపింది. కమిషన్ సాంకేతిక నిపుణుల కమిటీ సభ్యులు హాజరవుతారని ఎన్నికల సంఘం వెల్లడించింది.

డాక్-1 మ్యాక్స్ తయారీకి బ్రేక్

(మొదటిపేజీ తరువాయి)

ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాధికారి ఒకరు తెలిపారు. గురువారం ఉదయం నోయిడా శివార్లలోని కంపెనీ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించి, మందు నమూనాలు సేకరించి వాటిని పరీక్షల కోసం చండీగఢ్‌లోని ప్రాంతీయ ఔషధాల పరీక్షల ల్యాబ్ (ఆర్‌డీటీఎల్)కు పంపినట్లు మాండవియా వెల్లడించారు. డిసెంబరు 27వ తేదీ నుంచి ఉజ్బెకిస్థాన్‌లోని డ్రగ్స్ రెగ్యులేటరీతో సీడీఎస్‌సీఓ సంప్రదింపులు జరుపుతోందన్నారు. మారియన్ బయోటెక్‌లో తనిఖీలను సీడీఎస్‌సీఓ, యూపీ డ్రగ్ కంటోల్ నిర్వహించాయి. వీరి నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి వెల్లడించారు. ఈ వ్యవహారంపై రెండు దేశాల ప్రభుత్వాలు దృష్టిని కేంద్రీకరించాయని మారియన్ బయోటెక్ న్యాయ ప్రతినిధి హసన్ హారిస్ తెలిపారు. 'సమస్య మాది కాదు. పరీక్షల్లో లోపాలు లేవు. పదేళ్లుగా పరిశ్రమలో ఉన్నాం. ప్రభుత్వ నివేదిక వచ్చాక దానిని పరిశీలించి ఆపై ఏం చేయాలో నిర్ణయిస్తాం. ప్రస్తుతానికి మందు తయారీని నిలిపివేశాం' అని అన్నారు. ఇటీవల గాంబియాలో 70 మంది పిల్లలు హరియాణ 'మైడెన్ ఫార్మస్యూటికల్స్' దగ్గు మందు తాగి ప్రాణాలు కోల్పోయిన విషయం విదితమే.

భారత దగ్గు మందులు ప్రాణాంతకం : కాంగ్రెస్

భారతీయ ఫార్మా కంపెనీల మందులు విదేశాల్లో పిల్లల ప్రాణాలు తీస్తున్నాయని విపక్ష కాంగ్రెస్ విమర్శించింది. భారత ఫార్మసీ ప్రపంచ ఫార్మసీ అని గొప్పలు చెప్పడం మానుకొని ఇటువంటి ఘటనలపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్రప్రభుత్వానికి హితవు పలికింది. 'భారత్‌లో తయారయ్యే దగ్గుమందులు ప్రాణాంతకమైనవి. నిన్న గాంబియాలో 70 మంది చిన్నారులు మృత్యువాత పడగా నేడు ఉజ్జెకిస్థాన్‌లో 18మంది పిల్లలు చనిపోయారు. భారతీయ ఫార్మసీ ప్రపంచ ఫార్మసీ అని గొప్పలు చెప్పడం ఆపి కఠిన చర్యలను మోదీ ప్రభుత్వం తీసుకోవాలి' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ట్వీట్ చేశారు. కాంగ్రెస్ విమర్శలను బీజేపీ తిప్పికొట్టింది. బీజేపీ ఐటీ శాఖ ఇన్‌చార్జి అమిత్ మాళవియా స్పందిస్తూ గాంబియాలో పిల్లల మరణానికి భారత్‌లో తయారైన దగ్గు మందుకు సంబంధం లేదని గాంబియా అధికారులు, డీసీజీఐ స్పష్టం చేసినానీ మోదీపై విద్వేషంతో కాంగ్రెస్ కళ్లు మూసుకుపోయాయి' అని వ్యాఖ్యానించారు.

అండగా ఉంటా

- బాధిత కుటుంబాలకు చంద్రబాబు భరోసా
- భారీగా ఆర్థిక సాయం అందజేత

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: కందుకూరు తొక్కిసలాటలో మృతి చెందిన ప్రతి కుటుంబానికి అండగా ఉంటానని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. చంద్రబాబు గురువారం మృతుల కుటుంబాలను పరామర్శించారు. కందుకూరు పట్టణం గుర్రంవారి పాలెంలోని కాకుమాని రాజా, ఓగూరు గ్రామంలో గడ్డం మధుబాబు, కొండముసుపాలెంలో కలవకూరి యానాది, గుడ్లూరు మండలం గుళ్లపాలెంలో ఉచ్చులూరి పురుషోత్తం, అమ్మవారిపాలెంలో మర్లపాటి చినకొండయ్య, ఉలవపాడు మండలం ఆత్మకూరులోని దేవినేని రవీంద్రబాబు కుటుంబాలను ఆయన పరామర్శించారు. భౌతిక కాయాలకు పూలదండలు వేసి నివాళి అర్పించారు. బాధిత కుటుంబాలను ఓదార్చారు. పార్టీ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. మట్టి ఖర్చుల నిమిత్తం ప్రతి కుటుంబానికి రూ.50 వేలు అందించారు. క్షతగాత్రులకు రూ.50 వేలతో పాటు పూర్తి వైద్య చికిత్స అందిస్తామని వెల్లడించారు.

బాధిత కుటుంబంలోని పిల్లలను ఎన్‌టీఆర్ ట్రస్టు ద్వారా చదివిస్తానని వెల్లడించారు. చంద్రబాబు సమక్షంలో నెల్లూరు జిల్లా నేతలు బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ తరపున రూ.15 లక్షలు, కందుకూరు తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు లక్ష రూపాయలు, టీడీపీ నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేశ్ రూ.లక్ష, కంచర్ల సుధాకర్ రూ.2లక్షలు, శిష్టా లోహిత్ రూ.లక్ష, తూర్పు రాయలసీమ ఎమ్మెల్సీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ రూ.లక్ష, మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు రూ.50 వేలు, బేబి నాయన రూ.50 వేలు, కేశినేని చిన్న రూ.50 వేలు, నెల్లూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ రూ.50 వేలు, పొడపాటి సుధాకర్ రూ.50 వేలు, వెనిగండ్ల రాము రూ.50 వేల చొప్పున అందజేస్తామని ప్రకటించారు. ఆ నగదును త్వరలో మృతుల కుటుంబాలకు అందజేయనున్నట్లు చెప్పారు. చంద్రబాబు వెంట నెల్లూరు, ప్రకాశం జిల్లా టీడీపీ నాయకులు ఉన్నారు.

'కందుకూరు' మృతులకు సీపీఐ సంతాపం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కందుకూరు తొక్కిసలాట మృతుల కుటుంబాలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఒక ప్రకటనలో ప్రగాఢ సంతాపం తెలిపారు. కందుకూరులో చంద్రబాబు నాయుడు రోడ్ షోలో విషాదం అలముకొని, తోపులాటలో ఎనిమిది మంది మరణించడం దిగ్భ్రాంతికరమని, ఈ ఘటనలో అమాయకులు చనిపోవడం బాధాకరమని అన్నారు. మృతులకు సంతాపాన్ని, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, రాజకీయ సభలకు పోలీసు బందోబస్తు కల్పించాలని ఆ ప్రకటనలో రామకృష్ణ కోరారు.

ఇంటెలిజెన్స్ వైఫల్యం వల్లే: అనిత

కందుకూరు దుర్ఘటనకు ప్రభుత్వ, ఇంటిలిజెన్స్ వైఫల్యమే కారణమని తెలుగు మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత అన్నారు. మంగళగిరి లోని టీడీపీ కార్యాలయంలో ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ, కుటుంబసభ్యుల్ని కోల్పోయిన బాధలో తాముంటే, వైసీపీనేతలు, మంత్రులు రాబందుల కంటే దారుణంగా ప్రవర్తిస్తున్నా రని, శవాలమీద పేలాలు ఏరుకుంటున్నారని, ఘటనపై ప్రధానమంత్రి స్పందించినా, ముఖ్యమంత్రి మనస్సుకరగలేదన్నారు. దురదృష్టకర ఘటన జరిగిన వెంటనే టీడీపీ అధినేతసహా, పార్టీనేతలు ఎందరో స్పందించారనీ గుర్తుచేశారు. శవరాజకీయాల్లో జగన్ దిట్టగా మారారని ఆమె మండిపడ్డారు. చంద్రబాబు సభలకు భారీస్థాయిలో జనంవస్తున్నారని ప్రభుత్వానికి తెలియదా..? అని ప్రశ్నించారు. కందుకూరు దుర్ఘటనపై ప్రతి టీడీపీకార్యకర్త చెప్పలేనంత బాధపడుతుంటే, అదిచూసి వైసీపీ నేతలు మరింత రెచ్చిపోతూ, రాక్షసానందం పొందుతున్నారన్నారు.

కిడ్నీ వ్యాధితో మరో ఇద్దరి మృతి

విశాలాంధ్ర-ఎ.కొండూరు: ఎన్‌టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలంలో కిడ్నీ సమస్యకు పరిష్కారం లభించడం లేదు. వరుస మరణాలు సంభవిస్తున్నా పాలకులు పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. కిడ్నీ వ్యాధి బారిన పడి ఇప్పటికే చాలామంది మృత్యువాత పడ్డారు. తాజాగా మండలంలోని చైతన్యనగర్ తండాకు చెందిన భూక్య సీతమ్మ (50), ఎస్సీ కాలనీకి చెందిన పొన్నంపల్లి డేవిడ్(45) గురువారం కిడ్నీ వ్యాధితో మృతి చెందారు. ఇద్దరూ సుదీర్ఘకాలంగా ఈ వ్యాధితో బాధపడు తున్నారు. విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకుం టున్నారు. ఈ విషయాలను వారి కుటుంబ సభ్యులు వెల్లడించారు. మండలంలోని కిడ్నీ వ్యాధిగ్రస్తులు పిట్టల్లా రాలిపోతున్నా ప్రభుత్వంలో చలనం రావడం లేదని బాధిత కుటుంబాలు మండిపడుతున్నాయి. ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని ప్రశ్నిస్తున్నారు. తమ సమస్య పరిష్కరించి... కొంతకాలమైనా బతికే అవకాశం కల్పించాలని వేడుకుంటున్నారు. కిడ్నీ మృతుల సంఖ్య పెరుగుతుండటంతో మండల ప్రజలు భయపడుతున్నారు.

వెంకన్నను దర్శించుకున్న సీజేఐ

విశాలాంధ్ర-తిరుమల: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ గురువారం తొలిసారిగా తిరుమల వెంకన్నను, వరాహస్వామిని దర్శించు కున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆలయం వద్దకు వచ్చిన ఆయనకు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో(ఎఫ్ఏసీ) అనిల్ కుమార్ సింఘాల్, అర్చకులు కలిసి సంప్రదాయబద్ధంగా ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వామి మహత్యాన్ని, ఆలయ చరిత్రను అర్చకులు వివరించారు. స్వామి దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో సీజేఐకు వేద పండితులు వేదాశీర్వచనం అందించారు. అనంతరం సీజేఐ, ఇతర ప్రముఖులకు తీర్థప్రసాదాలు, డ్రైఫ్లవర్ టెక్నాలజీతో రూపొందించిన శ్రీవారి చిత్రపటం, 2023 టీటీడీ క్యాలెండర్, డైరీలను అందజేశారు. అదనపు ఈవో(ఎఫ్ఏసీ) వీరబ్రహ్మం, సీవీఎస్వో నరసింహ కిశోర్, ఆలయ డెప్యూటీ ఈఓ రమేష్ బాబు, వీజీవోలు బాలిరెడ్డి, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణకు సంఘటిత పోరు

ఈశ్వరయ్య పిలుపు

విశాలాంధ్ర-ఒంగోలు: కేంద్ర, రాష్ట్ర పాలకులు కాలరాస్తున్న ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ కోసం సీపీఐ సంఘటిత పోరు నిర్వహించనున్నదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య తెలిపారు. ఒంగోలులోని మల్లయ్యలింగం భవన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నరేంద్రమోదీ పాలనలో మైనారిటీలు, దళితులు, గిరిజనులు అభద్రతాభావంతో జీవిస్తున్నారన్నారు. మతోన్మాద, కార్పొరేట్ అనుకూల వైఖరి అవలంబిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా కమ్యూనిస్టులు పనిచేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. తాము అధికారంలోకొస్తే పేదలందరికీ ఇళ్లస్థలాలు కేటాయించి, ఉచితంగా ఇళ్లు నిర్మించి ఇస్తామని గత ఎన్నికల సందర్భంగా జగన్మోహనరెడ్డి ఇచ్చిన హామీ మూడేళ్లు గడచినా నెరవేర్చలేదన్నారు. సెంటు స్థలం మాత్రమే కేటాయించి, పైగా ఇళ్లను లబ్ధిదారులే నిర్మించుకోవాలని ఒక్కో ఇంటి నిర్మాణానికి కేవలం రూ.1.50 లక్షలు మాత్రమే ఇస్తామని చెబుతున్నారన్నారు. రాష్ట్రంలో జగన్ అధికారం చేపట్టిన నాటి నుంచి కేవలం అప్పులు చేయడంపై పెట్టిన దృష్టి, రాష్ట్ర అభివృద్ధిపై పెట్టలేదన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ వెంకట్రావు, కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, పీవీఆర్ చౌదరి పాల్గొన్నారు.

ఒకటో తేదీనే జీతాలు చెల్లించాలి

కత్తి నరసింహారెడ్డి డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ప్రతినెల 1వ తేదీనే జీతాలు చెల్లించాలని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కర్నూలులోని సలాం ఖాన్ ఎస్టీయూ భవన్లో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి అధ్యక్షతన జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయుల పిల్లల చదువులు, పెళ్లిళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ లోన్లు, ఫైనల్ చెల్లింపులు, సరెండర్ లీవ్‌లు, డీఏ బకాయిల కోసం నెలలు తరబడి ఎదురుచూసే పరిస్థితులు గతంలో ఎప్పుడూ లేవన్నారు. జీతాల కోసం రోడ్లెక్కే పరిస్థితి రావడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ బకాయిలు విడుదల చేయడంతో పాటు ఒకటో తేదీన జీతాలు చెల్లించేలా సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు విడుదల చేయాలని లేనిపక్షంలో ఆందోళన చేపట్టడానికి వెనుకాడబోమని స్పష్టం చేశారు. బదిలీలపై రోజుకో సవరణ ఉత్తర్వులు విడుదల చేయడం వల్లనే ప్రతిష్టంభన ఏర్పడడంతో పాటు న్యాయస్థానాలను వందల మంది ఉపాధ్యాయులు ఆశ్రయించారని, ఉత్తర్వులు విడుదల చేశాక సంఘాలతో మాట్లాడటం మొదలు పెడుతున్నారని బదిలీల మార్గదర్శకాలకు ముందే ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి ఉంటే ఇప్పుడు ఈ పరిస్థితి ఉత్పన్నం అయ్యేది కాదన్నారు. వెంటనే ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయాన్ని పరిగణలోనికి తీసుకొని అసంబద్ధమైన వాటిని తొలగించడంతోపాటు భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితి పునరావతం కాకుండా శాశ్వత బదిలీల కోడును రూపొందించి విడుదల చేయాలని కోరారు. విద్యా సంవత్సరం ప్రారంభమై ఆరు నెలలు ముగిసిన విద్యార్థుల సంఖ్య అవసరమైన టీచర్లు నియామకం చేయకపోవడం దారుణమన్నారు. ప్రధానోపాధ్యాయులు, టీచర్లు యాప్‌ల భారంతో సతమవుతమవుతున్నారని ప్రతి పాఠశాలకు ఒక కంప్యూటర్ టీచర్, వాచ్‌మేన్‌ను జాప్యం లేకుండా వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు వెంటనే నవంబర్ నెల జీతాలు చెల్లించాలని జీవో నెంబర్ 24 ప్రకారంగా ఎంటీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించకుంటే రాజీలేని ఆందోళన చేపడతామని హెచ్చరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి టీకే జానార్దన్, రాష్ట్ర మైనారిటీ కన్వీనర్ ముదాసిర్ అహమ్మద్, సీనియర్ నాయకులు శేఖర్, యల్ల నాగరాజు, గోవిందు, భాస్కర్, వెంకట్రాముడు పాల్గొన్నారు.

అరసం విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా

సీతారత్నం, అప్పలరాజు

విశాలాంధ్ర-విశాఖ: అభ్యుదయ రచయితల సంఘం (అరసం) విశాఖ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైందని అరసం రాష్ట్ర కార్యదర్శి ఉప్పల అప్పలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా ఆచార్య అయ్యగారి సీతారత్నం, ప్రధాన కార్యదర్శిగా ఉప్పల అప్పలరాజు, ఉపాధ్యక్షుడిగా ఎస్.హనుమంతరావు, కార్యదర్శులుగా డాక్టర్ సీఎన్ క్షేత్రపాల్ రెడ్డి, పి.శ్యామసుందర్, విరియాల గౌతమ్, కార్యవర్గ సభ్యులుగా ఏవీఆర్ మూర్తి, బసుపోతన, వేల్పూరి నాగు, బి.అప్పారావు, పి జగదీశ్వరరావు, గౌరవ సలహాదారులుగా ఆచార్య ఎస్ ఎం ఇక్బాల్, ఆచార్య కొండపల్లి సుదర్శన్ రాజు, డాక్టర్ కె.మధుసూదన్, డాక్టర్ కెవీఎస్ఎన్ మూర్తి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ విశాఖ జిల్లా పరిధిలో అరసం విస్తరణకు సాహితీ వేత్తలు, కవులు, రచయితల సహాయ సహకారాలు తీసుకోని ముందుకు వెళతామని చెప్పారు.

పల్లెల్లో శ్మశాన వాటికకు స్థలం

ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని ప్రతి పల్లెల్లో ఎస్సీ ప్రజలకు శ్మశాన వాటికల కోసం ఎకరా భూమి కేటాయించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్డు కులాల(ఎస్సీ) కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌ను తాను కలిసి రాష్ట్రంలోని ఎస్సీ కాలనీల శ్మశాన వాటికల కొరత అంశాన్ని ప్రస్తావించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని ఎస్సీ కాలనీలకు శ్మశాన వాటికలు లేక, మనుషులు చనిపోయినప్పుడు కాలవ గట్లపైన, రోడ్ల పక్కన పూడ్చిపెడుతున్నారని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరానన్నారు. దానిపై సీఎం స్పందిస్తూ ప్రతి పల్లెకూ ఎకరా భూమి కేటాయించేందుకు , దీనిపై 45 రోజుల కార్యాచరణ ప్రణాళిక ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్లకు తగిన భూముల సేకరణకు ఆదేశించినట్లు తెలిపారు. తక్షణమే ఎస్సీల శ్మశాన వాటికలకు భూములు గుర్తించి, ఆయా పంచాయతీలకు ఆదేశించాలని సీఎం ఆదేశించినందుకు విక్టర్ ప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు.

భూ పంపిణీ కోసం

2న కలెక్టర్లకు వినతిపత్రాలు

ఆవుల శేఖర్ పిలుపు

విశాలాంధ్ర-ఉండి: పేదలకు భూపంపిణీ కోసం జనవరి 2న కలెక్టర్లకు విజ్ఞాపన పత్రాలు సమర్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం పశ్చిమగోదావరి జిల్లా సమావేశం సీపీఐ ఉండి కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సనపల శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం జరిగింది. ఆవుల శేఖర్ మాట్లాడుతూ పేదలకు భూ పంపిణీ జరిగే వరకు భూ పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టంచేశారు. జనవరి 2న జిల్లా కలెక్టర్ల ద్వారా ముఖ్యమంత్రి జగన్‌కు విజ్ఞాపన పత్రాలు సమర్పిస్తామన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాలలో ముఖ్యమైనది... కోనేరు రంగారావు కమిటీ సిఫారసులను ముఖ్యమంత్రి జగన్ నవరత్నాలలో చేర్చకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. జగనన్న కాలనీలలో రూ.5 లక్షలతో పక్కా గృహాల నిర్మాణం కోసం దశలవారీ పోరాటం చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 32 లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసినప్పటికీ...ఇళ్ల నిర్మాణంలో పూర్తిగా విఫలమైందని ఆవుల శేఖర్ విమర్శించారు. లబ్ధిదారులతో సంతకాలు సేకరించి తహసీల్దార్లకు విజ్ఞాపన పత్రాలు సమర్పించాలని ఆయన కోరారు. ఉపాధి కూలీల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో ఇంకా 70 కోట్ల మంది పేదలు మూడు పూటలా తిండి లేక పస్తులతో జీవిస్తున్నారన్నారు. 60 శాతం మందికి సెంటు భూమి లేదని, 35 శాతం మందికి సొంతిల్లు లేదని, సురక్షిత తాగునీరు అందక 70 శాతం మంది రోగాల బారిన పడుతున్నారని వివరించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో దళితులు, గిరిజనులు, బలహీనవర్గాల కాలనీలకు వెళ్లి సమస్యలు తెలుసుకోవాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వం పెంచాలని సూచించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలిశెట్టి వెంకట్రావు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా మహిళలకు, యువకులకు ఆటల పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించాలని కోరారు. జిల్లా కార్యదర్శి కలింగ లక్ష్మణ్ మాట్లాడగా, దుబాయ్ శీను, గంజి రాజు, వెంకటరాజు, కోన గొల్లయ్య, జయకృష్ణ, ఎం.నాగేశ్వరావు పాల్గొన్నారు.

28న సిద్ధేశ్వరం వద్ద ప్రజా ప్రదర్శన: బైరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: నంద్యాల జిల్లా సిద్ధేశ్వరం వద్ద ఐకాన్ బ్రిడ్జితో పాటు బ్యారేజీ నిర్మించాలని మాజీ ఎమ్మెల్యే, రాయలసీమ అభివృద్ధి స్టీరింగ్ కమిటీ చైర్మన్ బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఇందుకోసం సిద్ధేశ్వరం వద్ద జనవరి 28న భారీ ప్రజాప్రదర్శన నిర్వహిస్తున్నామని, పాలకులు మారినా సీమ ప్రజల బతుకులు మారడం లేదని చెప్పారు. బైరెడ్డి కళ్యాణమండపంలో రాయలసీమ నాయకులతో కలసి గురువారం ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. ఈ ప్రాంత నాయకులు చాలామంది కీలక పదవుల్లో ఉన్నా రాయలసీమకు ఏమీ చేయలేదన్నారు. రాయలసీమలో అన్ని వనరులు ఉన్నా పాలకుల నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధి కుంటుపడిందన్నారు. తుంగభద్ర, కృష్ణా నదులు ఇక్కడి నుండే దిగువకు పోతున్నా పెద్ద రిజర్వాయర్ కట్టాలన్న ఆలోచనను పాలకులు చేయపోవడం దారుణమన్నారు. రాయలసీమ ప్రజలు, నిరుద్యోగ యువకులు హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రాంతాలకు వలస పోతున్నారన్నారు. పెద్ద చదువులు చదివి సెక్యూరిటీ గార్డుల్లా, ఉపాధి హామీలో మట్టి పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీమలో ఉన్న చెరువులను కొంతమంది కబ్జా చేయడంతో...వాటి ఆనవాళ్లు కూడా కనిపించడం లేదన్నారు. తుంగభద్ర నుండి 500 టీఎంసీల నీరు వృథాగా సముద్రంలో కలిసి పోతున్నాయన్నారు. కేంద్రప్రభుత్వం హైదరాబాద్ నుండి సిద్ధేశ్వరం మీదుగా తిరుపతికి రూ.1200 కోట్లతో ఐకాన్ బిడ్జి నిర్మాణం చేపట్టిందన్నారు. దీనితోపాటు బ్యారేజీ నిర్మిస్తే రాయలసీమకు ఉపయోగపడుతుందన్నారు.

'విట్' విద్యార్థికి బంగారు పతాకాలు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆలిండియా టైక్వాన్-డో అసోసియేషన్ (ఏఐటీఏ) పోటీలలో వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయానికి చెందిన కంభం వినయ్ రెండు బంగారు పతకాలు సాధించాడు. ఇటీవల ఒంగోలు జరిగిన ఆలిండియా టైక్వాన్ డో ఛాంపియన్ షిప్-2022 పోటీల్లో విట్ యూనివర్సిటీ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో రెండవ సంవత్సరం చదువుతున్న కంభం వినయ్ అద్భుత ప్రతిభను చాటి 64 కిలోల పవర్ బ్రేకింగ్ విభాగంలో ఒక స్వర్ణ పతకాన్ని, స్పారింగ్ విభాగంలో మరో బంగారు పతాకాన్ని సాధించాడు. గత ఏడాది హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో జరిగిన 2021 ఛాంపియన్ షిప్ పోటీల్లోనూ ఇదే విద్యార్థి పాల్గొని ఒక స్వర్ణ, ఒక కాంస్య పతకాన్ని సాధించడం విశేషం. వరుసగా రెండు సంవత్సరాల నుంచి టైక్వాన్ డో పోటీల్లో అద్భుత ప్రతిభను చాటుతున్న వినయ్‌ను గురువారం వీఐటీ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్వీ కోటారెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి అభినందించారు. అంతర్జాతీయ పోటీల్లోనూ ప్రతిభను చాటాలని వారు వినయ్‌ను ఆశీర్వదించారు.

జీవో 187 సవరించాలి: ఎస్టీయూ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం తలపెట్టిన ఉపాధ్యాయుల బదిలీల జీవోలు 187, 190ను సవరించి తక్షణమే బదిలీలు పూర్తి చేయాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, హెచ్.తిమ్మన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఇబ్రహీంపట్నం లోని విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలో రాష్ట్ర సంయుక్త సంచాలకులు మువ్వా రామలింగానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎస్టీయూ నేతలు మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సర్దుబాటు, రేషనలైజేషన్, జాతీయ విద్యా విధానం మ్యాపింగ్, తదితర అంశాల వల్ల తప్పనిసరి బదిలీ కావలసిన చోట సీనియర్, జూనియర్, ఉపాధ్యాయులు ఇద్దరూ దరఖాస్తు చేయకపోతే వారికి ఇప్పుడు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలన్నారు. 2021 అక్టోబరులో పదోన్నతి పొంది కోర్టుకెళ్లిన ఉపాధ్యాయులకు ఇచ్చిన నోటీసులు ఉపసంహరించాలని, బదిలీలు తక్షణమే పూర్తి చేసి 2022 నవంబర్‌లో స్కూల్ అసిస్టెంట్ పదోన్నతి కోసం సంసిద్ధత వ్యక్తం చేసిన ఉపాధ్యాయులకు తక్షణం పదోన్నతులు కల్పించి పాఠశాలలు కేటాయించాలని, వారికి నవంబరు 2022 నుంచి నోషనల్ సీనియారిటీ రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. జాతీయ విద్యా విధానంలో భాగంగా కన్వర్షన్ ఇచ్చిన ఉపాధ్యాయులకు వారు తప్పనిసరి బదిలీ అయితే అదనపు పాయింట్లు కేటాయించాలన్నారు. స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులను సర్దు బాటు, బదిలీలు పదోన్నతులు చేసి వారికి న్యాయం చేయాలని, ఉపాధ్యాయ బదిలీల పైన రోజుకో నూతన నిబంధన అమలు చేయకుండా కర్ణాటక రాష్ట్రంలో మాదిరిగా శాశ్వత బదిలీ చట్టం రూపొందించాలని కోరారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు పక్షవాతం, వెన్నెముక సర్జరీ, బ్రెయిన్ హేమరేజి తదితర వ్యాధులను కూడా న్యూరో సర్జరీ కింద అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఏపీ సచివాలయం అధ్యక్షునిగా మళ్లీ వెంకటరామిరెడ్డి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: ఆంధ్రప్రదేశ్ సచివాలయం అధ్యక్షునిగా కాకర్ల వెంకటరామిరెడ్డి రెండోసారి ఎన్నికయ్యారు. ఆయన గురువారం వెలగపూడిలో ప్రమాణస్వీకారం చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల సమైక్య రాష్ట్రం (ఏపీ జీఈఎఫ్) చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి అధిక మెజారిటీతో మరోమారు ఎన్నిక కావడంతో ఆయనను గుంటూరు జిల్లా ఏపీ జీఈఎఫ్ కమిటీ ఘనంగా సన్మానించింది. ఏపీ జీఈఎఫ్ గుంటూరు జిల్లా కన్వీనర్ అలవాల అరుణ భాస్కరరెడ్డి మాట్లాడుతూ వెంకటరామిరెడ్డి విజయం ఏపీ జీఈఎఫ్‌లోని 100 సంఘాలకు బలాన్నిచ్చిందన్నారు. రానున్న రోజుల్లో అన్ని ఉద్యోగ జేఏసీలకంటే ఏపీ జీఈఎఫ్ ముందుంటుందని ఆకాంక్షించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కార సంధానకర్త కాకర్ల అని అన్నారు. ఏపీ జీఈఎఫ్ జిల్లా కో-కన్వీనర్ మురికిపూడి దేవపాల్ మాట్లాడుతూ కాకర్ల వెంకటరామిరెడ్డి నిగర్వి, ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వానికి -ఉద్యోగులకు మధ్య వారధి అని అన్నారు. రాష్ట్ర సచివాలయ చరిత్రలోనే అనితర సాధ్యమైన విజయాన్ని సాధించినందుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బత్తుల అంకమ్మరావు, డాక్టర్ కిశోర్‌బాబు పాల్గొన్నారు.

బెడిసికొట్టిన టీడీపీ ప్లాన్: సజ్జల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కందుకూరులో జనసంద్రం అనే టీడీపీ ప్లాన్ బెడిసికొట్టిందనీ, ఉద్దేశ్యపూర్వకంగానే ఇరుకురోడ్డులో టీడీపీ అధినేత చంద్రబాబు రోడ్ షో నిర్వహించడంతోనే ఈ ఘటన జరిగిందని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ధ్వజమెత్తారు. గురువారం మీడియాతో సజ్జల మాట్లాడుతూ జనం ఎక్కువ వచ్చారని పబ్లిసిటీ చేసుకునేందుకుగాను చంద్రబాబు ప్రయత్నించారని, ఆ పబ్లిసిటీకి ఎనిమిది మంది బలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు సూచనలు ఏమైనా పాటించారా?, అనుమతి తీసుకున్న ప్రాంతం కంటే ముందుకెళ్లి సభను నిర్వహించడంతోనే ఈ దుర్ఘటన నెలకొందన్నారు. ఇరుకురోడ్డులో రోడ్‌షో ద్వారా...డ్రోన్ల తో జనం బాగా వచ్చారని చూపించుకునేందుకు ప్రయత్నించారని పేర్కొన్నారు. ఈ తొక్కిసలాట ఘటనకు చంద్రబాబే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై చంద్రబాబు మొహంలో ఎలాంటి పశ్చాతాపం లేదనీ, ఆయనలో లెక్కలేనితనం, అహంకారం కన్పిస్తోందని సజ్జల అన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పుష్కరాల సందర్భంగా అమాయకులను బలి తీసుకున్నారంటూ గుర్తుచేశారు. చంద్రబాబుకు ప్రజల ప్రాణాలంటే లెక్కలేదని మండిపడ్డారు.

సంపాదకీయం

గంగా స్నానం చేయకపోతే వైతరిణి దాటాల్సిందే

అవినీతి ఆరోపణలు, సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్, ఆదాయపు పన్నుశాఖ లాంటి కేంద్ర ప్రభుత్వంలోని వ్యవస్థల దాడులకు గురైనవారు బీజేపీలో చేరితో వారు గంగాస్నానం చేసినంత పునీతులు అయిపోతారు. లేకపోతే వారు గరుడ పురాణంలో పేర్కొన్న వైతరిణీ నదిని దాటుకుని నరకంలో ప్రవేశించవలసిందే. మోదీ ప్రభుత్వం సకల రాజ్యాంగ వ్యవస్థలను స్వప్రయోజనాలకోసం దుర్వినియోగం చేస్తోందన్నది పాత మాట. రాజకీయ ప్రత్యర్థులను బెదరగొట్టడానికి, వారిని అపఖ్యాతి పాలుచేయడానికి ఈ దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తోందన్నది వర్తమాన చరిత్ర. మోదీ మాట విననివారు ఎంతటి వారైనా ఇదే పద్ధతి. కేంద్ర ప్రభుత్వ అధీనంలోని సంస్థల దాడులకు గురికాకుండా తప్పించుకున్న బీజేపీయేతర పార్టీల నాయకులు ఎవరో తెలుసుకోవాలంటే వెయ్యి కాగడాలు పట్టి వెతకవలసిందే. నితీశ్‌కుమార్ నాయకత్వంలో బిహార్ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న రాష్ట్రీయ జనతాదళ్ నాయకులు లాలూప్రసాద్ యాదవ్, ఉపముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ మీద సీబీఐ దాడులు చేయించి మహాఘట్ బంధన్ ప్రభుత్వాన్ని అస్థిరం చేయాలని బీజేపీ కంకణం కట్టుకున్నట్టుంది. లాలూప్రసాద్ యాదవ్ యు.పి.ఏ. సర్కారులో రైల్వేశాఖ మంత్రిగా ఉన్నప్పుడు రైల్వేలలో ఉద్యోగ నియామకాల కోసం భూములు తీసుకున్నారని ఆరోపిస్తూ లాలూ, ఆయన కుమారుడు తేజస్వి, ఇద్దరు కూతుర్లు – ఇలా మొత్తం 16మంది మీద సీబీఐ కేసులు మోపింది. ఈ ఆరోపణల్లో చాలా రుజువు కాలేదు. అయినా ఇప్పుడు మళ్లీ అవే ఆరోపణలతో కేంద్ర ప్రభుత్వం లాలూను, ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్‌ను ఇరుకున పెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. లాలూ రైల్వేమంత్రిగా ఉన్నప్పుడు ఉద్యోగార్థుల నుంచి సమకూరిన అక్రమ సంపాదనతో తేజస్వీ యాదవ్ గురుగ్రాంలో అర్బన్ క్యూబ్స్ అనే పెద్ద మాల్ నిర్మించారని సీబీఐ ఇంతకు ముందు ఆరోపించింది. అయితే ఈ ఆరోపణలను సీబీఐ రుజువు చేయలేక పోయినందువల్ల తేలిపోయాయి. ఈ మాల్ వైట్ లాండ్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు చెందిందని, అందులో బీజేపీ ఎంపీ పెట్టుబడి ఉందని తేజస్వి ఎదురు దాడికి దిగారు. ప్రస్తుతం ఈ మాల్ యజమాని కృష్ణ కుమార్ అని కూడా తేజస్వి వెల్లడించారు. పైగా ఈ మాల్ ప్రారంభోత్సవం హర్యానా ముఖ్యమంత్రి, బీజేపీ నాయకుడు మనోహర్ లాల్ ఖట్టర్ చేతుల మీదుగా జరిగింది. ఈ వివరాలకు సమాధానం చెప్పవలసిన బాధ్యత ఇప్పుడు సీబీఐదే. ఆ మాల్ అసలు యజమాని ఎవరో కూడా చెప్పాల్సింది కూడా సీబీఐనే. తేజస్వి గట్టిగా సమాధానం చెప్పిన తరవాత కొంతకాలం సీబీఐ నోరు మెదపలేదు. ఉద్యోగాలు ఇచ్చినందుకు లాలూ యాదవ్ కుటుంబం వారికి 1458 మంది తమ భూములు ఇచ్చేశారని సీబీఐ కొత్త రాగం ఎత్తుకుంది. ఈ సమాచారం తమకు దొరికిన కంప్యూటర్ హార్డ్ డిస్క్‌లో ఉందని సీబీఐ అంటోంది. ఇంతకు ముందు సీబీఐ దాడుల్లో ఈ డిస్క్ దొరకలేదట. గత నెల జరిగిన దాడుల్లో ఈ డిస్క్ సీబీఐ చేతికి చిక్కిందట. తమ వలలో పెద్దచేప పడిందని మోదీ, అమిత్ షా ఆదేశాల మేరకు పనిచేసే సీబీఐ తెగ సంబర పడిపోతోంది. ఎదురు లేనిది అనుకుంటున్న ఈ సాక్ష్యాధారం దొరకక ముందు కూడా లాలూ యాదవ్‌ను, తేజస్వీ యాదవ్‌ను అరెస్టు చేయవచ్చునన్న సంకేతాలు ఇచ్చింది. 16 కేసుల్లో తమ దగ్గర తిరుగులేని సాక్ష్యం ఉందని సీబీఐ చెప్తోంది కనక మరి లాలూ యాదవ్‌ను, తేజస్విని ఎందుకు అరెస్టు చేయడం లేదో!

సీబీఐలో సమర్థులైన పోలీసు అధికారులు ఉన్నారో లేదో కానీ మోదీ, అమిత్ షా అడుగులకు మడుగులొత్తే మేధా సంపత్తిగల పోలీసు అధికారులు మాత్రం ఉన్నారు. ఏ మాటకు ఆ మాట లాలూ మీద పశు గ్రాస కుంభకోణం ఆరోపణలు వచ్చినప్పుడు కూడా సీబీఐ అధికారులు ఎందుకొచ్చిన గొడవ అద్వాణీతో ఏదో రాజీ కుదుర్చుకోండి అని సలహా ఇచ్చారు. కానీ లాలూ ఈ ఉచిత సలహాను లక్ష్య పెట్టలేదు. లొంగి పోవడానికి ఆయన ససేమిరా అంగీకరించలేదు. దానితో లాలూ రాజకీయ జీవితం నాశనమైంది. ఇప్పుడు తేజస్వీ యాదవ్ కూడా అదే పట్టుదలతో ఉన్నారు. బీజేపీతో ఘర్షణకు దిగకుండా నితీశ్‌కుమార్‌తో తేజస్వీ పార్టీ తెగతెంపులు చేసుకోవాలన్నది మోదీ, షా ద్వయం వ్యూహం. అయితే వీరిద్దరూ ఒక్క అంశాన్ని గ్రహిస్తున్నట్టు లేరు. బీజేపీతో ఏ దశలోనూ కత్తు కలపకుండా రాజకీయాలలో కొనసాగుతున్న పార్టీ రాష్ట్రీయ జనతాదళ్ మాత్రమే. ధిక్కారం సహించే తత్వం మోదీకి, అమిత్‌షాకు లేదు కనక లాలూ మీద సీబీఐ కత్తి మళ్లీ వేలాడదీస్తున్నారు. అద్వాణీ రథ యాత్రను సమస్తిపూర్‌లో నిలవరించినందుకు బీజేపీ లాలూ మీద కసి తీర్చుకుంది. సీబీఐ ఆరోపణలు గుప్పిస్తున్నది లాలూ మీదే అయినా బీజేపీ అసలుగురి ప్రస్తుతం ఆర్.జె.డి.ని నడిపిస్తున్న తేజస్వీ యాదవ్ మీదే. కళంకితుడిగా నిలబెట్టి ఆయన రాజకీయ భవిష్యత్తును నాశనం చేయాలని బీజేపీ అగ్రనాయకద్వయం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే తండ్రీ కొడుకులిద్దరూ సీబీఐ దాడులకు వెరువకుండా కోర్టులోనే ఈ వ్యవహారం తేల్చుకోవడానికి సంసిద్ధులై ఉన్నారు.

కొడుకు రాజకీయ భవిష్యత్తు దెబ్బతింటుందని భయపడి లాలూ లొంగి పోతారనుకున్న బీజేపీ అంచనా విఫలమైంది. ఈ క్రమంలో సీబీఐ తాబేదారీతత్వం మాత్రం వ్యక్తమైంది. ఈ ఏడాది మే 18న లాలూ, ఆయన భార్య రబ్రీదేవి, కూతుర్లు మీసా భారతి, హేమా యాదవ్ మీద రైల్వే ఉద్యోగాలకు సంబంధించిన పాత కేసులోనే కొన్ని కొత్త సాక్ష్యాధారాలు దొరికాయని సీబీఐ సరికొత్త కేసు దాఖలు చేసింది. నితీశ్ కుమార్ బీజేపీతో తెగతెంపులు చేసుకుని తేజస్వీ నాయకత్వంలోని ఆర్.జె.డి, వామపక్షాలతో కలిసి మహాఘట్ బంధన్ ప్రభుత్వం ఏర్పాటుచేయడం బీజేపీ నాయకులకు గొంతు దిగడం లేదు. అందుకే ఆగస్టు 24న బిహార్‌లో మహాఘట్ బంధన్ ప్రభుత్వం విశ్వాస తీర్మానం నెగ్గడానికి కొద్ది గంటల ముందు సీబీఐ రాష్ట్రీయ జనతాదళ్ నాయకుల మీద వరసగా దాడులు చేసింది. మొదట చేసిన దాడుల్లో అయిదు విక్రయపత్రాలు దొరికాయి అని చెప్పిన సీబీఐ ఇప్పుడు తమకు 200 విక్రయపత్రాలు దొరికాయని అంటోంది. నితీశ్ నాయకత్వంలోని ప్రభుత్వం పదిలంగా ఉంటే 2024 ఎన్నికలలో బిహార్‌లో తాము తక్కువ స్థానాలతో సర్దుకోవాల్సి వస్తుందన్నది బీజేపీ నాయక ద్వయం భయం. తేజస్విని అరెస్టు చేయకపోవడం, కోర్టులో కేసు దాఖలు చేయకపోవడం బీజేపీ కుతంత్రాలకు నిదర్శనం. గంగానదిలో మునగకపోతే వైతరిణి దాటక తప్పదని అని భయపెట్టడమే బీజేపీ అగ్రనాయకుల అసలు ప్రణాళిక.

న్యాయానికి దారేది

రా బావా రా మొన్న పదో మీటింగుకు వెడుతున్నానన్నావు ఏంటది? ఎక్కడ జరిగింది? అవును బావ నువ్వు మాతోవస్తే బాగుండేది. అసలు ఆ మీటింగులో చాలా మంది న్యాయ కోవిదులు మాట్లాడారు బావ. అది సరే అసలు వారేం చెప్పారు. అందరి ఉపన్యాసాలు విన్నాక న్యాయమా ఎక్కడున్నావు.. నీ చిరునామా ఎక్కడ... అని అరవాలనిపించింది. అదేంటి బావ న్యాయం, అన్యాయం రెండు ప్రతి మనిషిలో ఉంటాయి. అయితే అవసరాన్ని బట్టి కొందరు స్వార్థంగా, మరికొందరు అన్యాయంగా ప్రవర్తిసారు. అదిసరే వారేం చెప్పారు బావ? చెప్పినవన్నీ నీతులే బావ. వారు అసలు కోర్టులో అన్యాయం జరగదని నూరు శాతం న్యాయమే జరుగుతుందంటారు. అదే నిజమైతే కింద కోర్టుకు భిన్నంగా పై కోర్టులో తీర్పువస్తోంది గద. అందరికీ పుస్తకాలలో ఒకే న్యాయం ఉంటుంది గద మరి అదేంటి బావ. అసలు కోర్టులో న్యాయమూర్తులకు కూడా రాజకీయ నాయకులు నిబంధనలు ఏర్పాటు చేయడంతో న్యాయమూర్తుల స్వేచ్ఛ హరిస్తున్నారు బావ. దాంతో సామాన్యుడు న్యాయమా నీవెక్కడ అని వాపోతున్నాడు బావ. నిజమే అవినీతిని ప్రోత్సహించిన ప్రభుత్వాలుండటంతో మేధావులకు న్యాయం చిరునామా దొరక్క తెరవెనుకకు చేరుతున్నారు బావ. స్వార్థం రాజ్యమేలుతున్న సమయంలో మేధావుల సలహాలు తీసుకునే పరిస్థితి లేదు. చివరకు రాష్ట్రపతి పాలన పెట్టినా కేంద్ర ప్రభుత్వ అనుయాయులే తెరవెనుక ఉండి పాలన చేస్తున్నారు. ప్రజలెన్నుకున్న ప్రజాప్రతినిధులు అవినీతి కూపంలో కూరుకుపోయారు. మనది ప్రజా స్వామ్య దేశం. కనుక సైనిక పాలన కోరుతాం. ఇటువంటి విపత్కర

పరిస్థితిలో న్యాయానికి, ఏ మార్గం అనుసరించాలో అర్థంకావడంలేదు బావ.

అసలు వ్యవస్థ మార్పుకు దోహదకారులు ఎవరని కాగడాపెట్టి వెదికినా ఎవరూ కనబడటంలేదు. ప్రలోభాలకు ఎరవేసి పాలకులు ప్రజలను మభ్య పెడుతున్నారని, ఓటు ద్వారా మార్పురాదని విసుగుచెందిన కొంతమంది యువకులు సాయుధ విప్లవమే సరైన మార్గమని అడవి దారి పడుతున్నారు బావ. గత 75 సంవత్సరాల పాలన విశ్లేషించుకుని తప్పును ఖండించి వారు లాఠీ దెబ్బలుతిని జైలు పాలవడం తప్ప అధినాయకులు తమ తప్పును అంగీకరించడం లేదు బావ. ఇటువంటి ప్రజావ్యతిరేక ప్రభుత్వాలు ఉన్నంత కాలం ఉద్యమాలు ఎంతకాలం బతికిబట్ట కట్టగలవు బావ. ఈ పరిస్థితిలో అటు సాయుధ విప్లవం కాక ఇటువ్యవస్థ మార్పుకు పూనుకోకపోతే న్యాయం జరగడానికి మార్గం ఏమిటని నేడు మేధావులును సైతం తొలుస్తున్న ప్రశ్న బావ. ప్రజల చేత, ప్రజల ద్వారా ఏర్పడిన ప్రభుత్వం ప్రజల సమస్యలు పక్కనపెట్టి అధికారమే పరమావధిగ మరల మరల అధికారం దక్కించుకునే ప్రయత్నంలో నిమగ్నమైతేనే సమస్య సమస్యగా మిగిలి సామాన్యుడు సతమతమై న్యాయానికి దారేది అని ఆక్రోశిస్తున్నాడు బావ. నిజమే ఈనాడు పాలకులు పార్లమెంటులో చర్చ అవసరంలేదని తాము చేసేదంతా ప్రజల మంచి కోసమే అంటున్నారు. అంతటితో ఆగక అసలు ప్రతిపక్షం అవసరం లేదంటున్నారు బావ. నిజమే మనరాష్ట్రానికి ప్రత్యేక హోదా అవసరమని అన్ని పార్టీలు ముక్తకంఠంతో మారుమ్రోగించినా ప్రస్తుత ప్రధాని మోదీ అది సాధ్యంకాదని చేతులు దులుపుకుంటున్నారు బావ. రాష్ట్రం విడిపోయినప్పుడు కాంగ్రెసు ప్రభుత్వం చేసిన చట్టాలు ఈ ప్రభుత్వం తుంగలో తొక్కితే ఇంకా న్యాయం ఎక్కడుంది బావ. నిజమే బావ నేతల తప్పులు ప్రజలకు శాపాలుగా మారుతున్నాయి బావ. అసలు ఎన్నికలు ముందుచేసిన వాగ్దానాలు మరచి పోయినట్లు నటిస్తే ప్రజలు ఏం చేయగలరు. నల్లధనం కుటుంబానికి 15 లక్షలు పంచుతానని ప్రగల్భాలు పలికిన మోదీ ఆ మాటను మరచినట్లు నటిస్తున్నాడు. పెద్దనోట్ల రద్దుతోనే సంస్కరణ అన్నారు మోదీ. నోట్లరద్దు డొల్లతనం రిజర్వుబ్యాంకు అధికారులు బైట పెట్టారుగా బావ. ప్రజలను చైతన్యపరచి రచయితలను, సంస్కర్తలను హత్యచేసిన వారిపై చర్య తీసుకోకుండా అవి మంచిపనులు కావని తేలికగా అనేసి (ప్రభుత్వాన్ని) ఏమనాలి బావ. ఏమంటాము బావ. ఏదైనా అంటే లాఠీ దెబ్బలకు, జైలుకు సిద్ధపడి అనాలి. ఈ పరిస్థితిలో అందుకు ఎంతమంది ముందుకువస్తారు బావ.

బావ నువు చెప్పేది అవసరమేగాని ఇదంతా జరగడం చాలా కష్టమనిపిస్తోంది బావ. ముందు అలాగే అనిపిస్తుంది బావ. చరిత్రలో ఏ సంస్కరణగాని, ఉద్యమంగాని, విప్లవంగాని జరిగిందంటే దాన్ని ముందు ప్రోత్సహించేది దాని భావజాలమే. ఒకరో లేక కొందరు వ్యక్తులో అందుకు అవసరమైన భావజాలం సృష్టిస్తే కొందరు మేధావులు, రచయితలు అవి ప్రజల బుర్రలోకి ఎక్కిస్తే సాధ్యంగానిదేదీ ఉండదు బావ. ఆ తరువాత ఉద్యమంగా, విప్లవంగా మారి అనుకున్నది సాధించినట్లు చరిత్ర నిరూపించింది.

సెల్: 9885569394

అమూల్‌కు పాలడెయిరీల తాకట్టు



రావుల వెంకయ్య

ఇటీవల డిసెంబరు 13న జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గంలో సహకారరంగంలో నడుస్తున్న 600 కోట్ల విలువైన చిత్తూరు డెయిరీ ఆస్తులను అమూల్ డెయిరీకి కారుచౌకగా 3.38 కోట్లకు 99 సంవత్సరాలకు లీజ్‌కు ఇవ్వాలని మంత్రివర్గం ఆమోదించింది. రాష్ట్రంలోని సహకారరంగంలో ఉన్న డెయిరీలను ఒక్కొక్కటిగా అమూల్ డెయిరీకి ధారాదత్తం చేయాలని జగన్ ప్రభుత్వం మొదలుపెట్టిందన్నమాట. జగన్ అధికారంలోకి రాకముందు చంద్రబాబుమీద అనేక ఆరోపణలుచేసి 'మేము అధికారంలోకి వస్తే మూతపడిన చిత్తూరు డెయిరీని పునరుద్ధరిస్తామని' ఎన్నికల్లో చాలాసార్లు వాగ్దానం చేశాడు.

భారతదేశం 18.71 కోట్ల టన్నులు 20.7 శాతంతో పాల ఉత్పత్తుల్లో ప్రపంచంలో అగ్రస్థానంలో వుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 'విజయ డెయిరీ' పేరుతో సహకారరంగంలో పాల ఉత్పత్తులు తయారుచేస్తుంది. వివిధ జిల్లాల్లో ఈ సహకార సంఘాల పేరుతో డెయిరీలు పనిచేస్తూ, కోట్ల విలువైన ఆస్తులు సమకూర్చుకుని నడుస్తున్నాయి. రాష్ట్రవ్యాపితంగా 3 వేల కోట్ల రూపాయల ఆస్తులు, 1500 కోట్ల విలువైన 700 ఎకరాల్లో సహకార పాలడెయిరీలు ఏర్పడ్డాయి. అందులో చిత్తూరు, ఒంగోలు, అనంతపురం, హిందూపురం, రాజమహేంద్రవరం, కంకిపాడు, పులివెందుల, ఏలూరు జిల్లా కొత్తపల్లిలో ఈ డెయిరీలు వున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 'బల్క్ మిల్క్' కూలింగ్ యూనిట్లు, 8 పాల ప్రాసెసింగ్ ప్లాంట్లు, 2 మిల్క్ చిల్లింగ్ కేంద్రాలు, మదనపల్లిలో యుహెచ్‌టీ ప్లాంట్లు, ఒంగోలులో 3000 టన్నుల సామర్థ్యం కలిగిన పాల ఫ్యాక్టరీలు వున్నాయి. అన్నమయ్య జిల్లా మదనపల్లిలో ఉన్న యుహెచ్‌టీ ప్లాంటు, చిత్తూరు విజయ డెయిరీని కారు చౌకగా 3.38 కోట్లకు అమూల్ డెయిరీకి అప్పగించారు. రాష్ట్ర విభజన తర్వాత ఆ ప్లాంటుకు 15 కోట్ల విలువైన యంత్రాలను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. నష్టాల్లో ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, కడప డెయిరీలు కొనసాగుతున్నాయి. కృష్ణా, సంగం,

విశాఖ డెయిరీలు లాభాల బాటలో ప్రయాణిస్తున్నాయి.

చిత్తూరు డెయిరీని పునరుద్ధరిస్తానని జగన్ వాగ్దానాల మీద వాగ్దానాలు చేశారు. పునరుద్ధరణ అంటే అమూల్‌కి తాకట్టు పెట్టటమేనా? కోట్ల విలువైన ఆస్తులను కారుచౌకగా అమ్మివేయడమేనా? ఇది జగన్ ప్రభుత్వం పాడి రైతులకు ఇచ్చిన బహుమానం. ఈ విషయాన్ని పాడి రైతులు ఆలోచించాల్సిన అవసరం వుంది. ఇక మరో వాగ్దానం విషయం చూద్దాం. తాను అధికారంలోకి వస్తే ప్రతి పాడి రైతుకు లీటరుకు 4 రూపాయలు చొప్పున బోనస్‌ను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పాడు. ఆయన అధికారంలోకి వచ్చి మూడున్నర సంవత్సరాలు దాటిపోయాయి. దానిమీద ఉలుకూ పలుకూ లేదు. మొత్తం సహకార డెయిరీలలో 22 లక్షల లీటర్ల పాలు పోస్తున్నారు. వీరికి లీటరుకు 4 రూపాయలు బోనస్ ఇస్తే నెలకు 26 కోట్లు అవుతుంది. ఈ మూడు సంవత్సరాలకు 1,108 కోట్లు అవుతుంది. ఉదాహరణకు ఒక గేదె ఉన్న రైతు సగటున 8 నెలలకు 2000 లీటర్ల పాలు ఉత్పత్తి చేస్తే, లీటరుకు 4 రూపాయలు బోనస్ లెక్కగడితే 8000 రూపాయలు అవుతుంది. అది ప్రభుత్వం కల్పిస్తే పాడి రైతులకు కొంత ఊరట కలిగేది. కానీ ఇప్పుడు ఆ మాటే ప్రభుత్వం చెప్పటం లేదు. అందువల్ల పాడి రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారు. రైతుకు చెల్లిస్తున్న పాలధర లీటరుకు 30 నుండి 35 రూపాయలు మాత్రమే. మార్కెట్లో వినిమయదారుల దగ్గర 60 నుండి 70 రూపాయలకు అమ్ముకుంటున్నారు. కనుక రైతుకు లీటరుకు 50 రూపాయలు చెల్లిస్తే గిట్టుబాటవుతుంది. దానికి ప్రభుత్వం పూనుకోవలసిన అవసరం ఎంతైనా వుంది.

ఇక అమూల్ డెయిరీ మాటకొస్తే 1964లో 'ఆనందమయి' పేరుతో గుజరాత్‌లో డా॥ కురియన్ నేతృత్వంలో సహకార రంగంలో నెల కొల్పారు. అనతికాలంలోనే అభివృద్ధిచెంది, 2010కి 'అమూల్ డెయిరీ'గా మారింది. 40 కోట్లతో ప్రారంభమై, 40 వేల కోట్ల రూపాయల లాభంతో విస్తరించింది. నాడు సహకారరంగంలో ఏర్పడిన అమూల్ సంస్థ తన విధానాల్ని మార్చుకుని ఇతర రాష్ట్రాలకు విస్తరించటం మొదలుపెట్టింది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్నాటక, గుజరాత్‌లలో పాల డెయిరీలు అమూల్ డెయిరీ ఆధీనంలో వున్నాయి. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ మీద గురిపెట్టి రాష్ట్రంలోని సహకార డెయిరీలను కబళించాలని ప్రయత్నిస్తోంది. దానికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేయూతనిస్తోంది. అమూల్ డెయిరీకి చెల్లించే ప్రతి రూపాయి గుజరాత్ ప్రభుత్వానికి పోతుంది. మన రాష్ట్రంలో పాడి రైతులను దోచుకుని గుజరాత్ ప్రభుత్వానికి లాభాలు కట్టబెట్టే విధానాన్ని మన ప్రభుత్వం మార్చుకోవాలి. 3 వేల కోట్ల రూపాయల విలువైన సహకారరంగంలో ఉన్న ఆస్తులను అమూల్‌కు తెగనమ్మటానికి రాష్ట్ర ప్రభుత్వం కంకణం కట్టుకుంది.

జగన్ ప్రభుత్వం అమూల్‌కు మన సహకారరంగంలో పనిచేస్తున్న పాల డెయిరీలను తాకట్టుపెట్టే విధానాన్ని విడనాడాలి. రాష్ట్రంలో సహకారరంగంలో ఉండే పాడి పరిశ్రమను అభివృద్ధిపర్చి కొనసాగించాలి. నష్టాల ఊబిలో ఉన్న ఒంగోలు, కడప, చిత్తూరు పాల డెయిరీలను పునరుద్ధరించాలి. పాడి పరిశ్రమకు చెందిన కోట్లాది ఆస్తులను సంరక్షించాలి. దీనికోసం పాడి రైతులందరు ఆందోళనకు సిద్ధంకావాలి.

వ్యాస రచయిత అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షులు

సవాళ్లు అధిగమిస్తేనే వృద్ధి

రాబోయే 2023 సంవత్సరంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ ఆవిర్భవిస్తుంది. ఇప్పటి వరకూ చైనా పేరున ఉన్న ఈ రికార్డు మనదేశం అధిగమించనున్న తరుణంలో మన ముంగిట అనేక సమస్యలు తాండవిస్తున్నాయి. ఇప్పటికే మనదేశంలో మూడు పూటలా తిండి లేని స్థితిలో ఇరవై శాతం జనాభా మగ్గుతున్నారు. ఆకలి కేకలు, పోషకాహారలోపంతో మహిళలు, బాలికలు అధికంగా ఉన్నట్లు జాతీయ ఆరోగ్య కుటుంబ సర్వే తెలిపింది. మనకంటే సుమారు ఆరు రెట్లు పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న చైనా, అనేక రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ ముందుకు సాగుతున్న వేళ, అధిక జనాభా ఉన్నా పెద్ద బరువుగా భావించకుండా, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ప్రపంచ వ్యాప్తంగా అనేక రంగాల్లో అభివృద్ధి సాధించింది. మరి మన భారతదేశం ఈ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆహారం, మంచినీరు, విద్య, వైద్యం ఎలా అందించగలరు అనేది అనేకమందిని వేధిస్తున్న ప్రశ్న...? ఇప్పటికే గత నలభై ఏళ్లుగా లేని విధంగా నిరుద్యోగం కరాళనృత్యం చేస్తుంది. అధిక ధరలతో సామాన్య ప్రజలు సతమతం అవుతున్నారు. జనాభాకు అనుగుణంగా నేటికీ ఆసుపత్రులు, పాఠశాలలు, వైద్యులు, ఉపాధ్యాయులు, నర్సులు లేరు. మౌలిక సదుపాయాలు లేవు. పబ్లిక్ రవాణా వ్యవస్థ కూడా అంతంత మాత్రంగానే ఉంది. ఇక దేశవ్యాప్తంగా జాతీయ రహదారులు మినహా మిగిలిన రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ ఎలా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందో మిలియన్ల డాలర్ల ప్రశ్న.

ముఖ్యంగా పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలంటే, సంపద వికేంద్రీకరణ పై దృష్టి సారించాలి. పన్నుల వ్యవస్థ పునః వ్యవస్థీకరణ చేయాలి. కేవలం కొద్ది మంది చేతుల్లోనే ఉన్న సగానికిపైగా ఉన్న దేశ సంపద వికేంద్రీకరణ జరిగే విధంగా ఆర్థిక వ్యవస్థను సమీక్ష చేయాలి. దేశంలో పారిశ్రామిక రంగానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. ఉత్పత్తి రంగాల్లో పెట్టుబడులు పెట్టి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి. ఎగుమతులు పెంచుట ద్వారా విదేశీ మారక ద్రవ్యం ఆర్జించడానికి ప్రయత్నాలు ముమ్మరం చేయాలి. కేవలం ఓట్లు దండుకునే పథకాలే ఎక్కువగా ఉంటున్నాయి. బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేయటం మంచిదే కానీ, వారి వాస్తవ జీవితాలు మెరుగు పరచడానికి సుస్థిర ఉపాధి అవకాశాలు కల్పించాలి. ప్రభుత్వ పంపిణీ వ్యవస్థను పగడ్బందీగా అమలు చేయాలి. ఉపాధి హామీ పథకాలు విస్తృతి పెంచి, ఎక్కువ మందికి లబ్ధి పొందేందుకు వీలుగా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలి. సంపన్న వర్గాల వారికి అధికంగా రాయితీలు, అప్పుల రద్దు విధానాలకు చెక్ పెట్టాలి. మొండి బాకీలు ముక్కు పిండి వసూలు చేయాలి. నిబంధనలు కఠినతరం చేయాలి. నల్లడబ్బు వెనక్కి రప్పించాలి. పన్నుల వ్యవస్థకు పదును పెట్టాలి. విదేశాలకు పారిపోయిన ఎగవేతదారులను వెనక్కి రప్పించాలి. పబ్లిక్ రంగాన్ని బలోపేతం చేయాలి. ముఖ్యంగా ప్రైవేటీకరణ పేరుతో లాభాల్లో ఉన్న సంస్థలను కూడా అమ్మి వేయడం, లీజుకు ఇవ్వండి వంటి నిర్ణయాలను మానుకోవాలి. దేశ ప్రగతికి రథచక్రాలు పబ్లిక్ రంగ సంస్థలే అని విశ్వసించాలి. గతిశక్తి, ఆత్మ నిర్భర్ భారత్, మేక్ ఇన్ ఇండియా వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టినా ఇప్పటి వరకూ అనుకున్నంత ప్రయోజనాలు చేకూరలేదు. ఇకనైనా పాలకులు విధానాలు వాస్తవానికి దగ్గరగా ఉండాలి. ఉత్పత్తి రంగాలకు , వ్యవసాయ రంగాలకు అధిక బడ్జెట్ కేటాయింపులు చేయాలి. ప్రతీ దానికీ దిగుమతులు పై ఆధారపడే స్థితి నుంచి బయటపడాలి. మధ్య తరగతి, కుటీర పరిశ్రమలు ప్రోత్సహించాలి. పెట్టుబడిదారీ దేశాల ఆజ్ఞలకు లోబడి పనిచేసే విధానానికి స్వస్తి పలకాలి. మనకు ప్రయోజనం కలుగజేసే విధానాలు అమలు చేయాలి. మన ఇరుగు పొరుగు దేశాలతో రాజకీయ ఆర్థిక వర్తక వాణిజ్య దౌత్య సంబంధాలు మెరుగు పరచడానికి ప్రయత్నాలు చేయాలి. అదే సమయంలో అక్రమ చొరబాటు దారులు, వలసలను నియంత్రణ చేయాలి. ముఖ్యంగా మన భారతదేశం రాజ్యాంగ ఆశయాలు, మత సామరస్యానికి, ఫెడరల్ వ్యవస్థ బలోపేతం చేయడానికి రాజ్యాంగ స్ఫూర్తితో పనిచేస్తూ, ప్రపంచంలోనే భవిష్యత్తులో అత్యంత పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించే స్థాయికి చేరుకోవాలని ఆశిద్దాం.

ప్రసాదరావు, 6305682733

యుద్ధం, కోవిడ్, ఆర్థిక మాంద్యం

ప్రపంచాన్ని రష్యా-ఉక్రెయిన్, మళ్లీ కోవిడ్-19 మహమ్మారి, ఆర్థికమాంద్యం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఈ పరిస్థితుల్లో భారత ప్రధాని నరేంద్ర మోదీ 2023లో 9 రాష్ట్రాల అసెంబ్లీలకు, 2024లో సార్వత్రిక ఎన్నికలకు ప్రచారం ప్రారంభించారు. త్వరలో యుద్ధం ముగిసే అవకాశాలున్నాయని రష్యా అధ్యక్షుడు వ్లదిమీర్ పుతిన్ ప్రకటించారు. 2020లో ప్రారంభమై దాదాపు మూడేళ్లు కొనసాగిన కోవిడ్-19 మహమ్మారి ప్రపంచాన్ని వణికించింది. దాదాపు రెండు కోట్ల మంది ప్రాణాలను ఈ మహమ్మారి హరించిందని అనధికార గణాంకాలు. అధికారిక గణాంకాలను ప్రభుత్వాలు వెల్లడించవని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ ప్రకటించారు. ప్రస్తుతం కోవిడ్ కొత్తరకం బిఎఫ్-7 చైనాను ముంచెత్తుతోందని వార్తలు వస్తున్నాయి. ఈ మహమ్మారి ఇప్పటికే అమెరికా, బ్రెజిల్, జపాన్ తదితర ఐరోపా దేశాల్లోనూ విస్తరిస్తూ తాజాగా ప్రజలను గడగడలాడిస్తోంది. భారతదేశంసైతం ఈ మహమ్మారి బారినపడకుండా ఉండదు. ఇప్పటికే దేశంలో కొన్ని వేల కొత్త కేసులు నమోదయ్యాయి. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు హెచ్చరికలు చేశాయి. జాగ్రత్తలూ ప్రకటించాయి. వ్యాధి విస్తరించకుండా కట్టుదిట్టమైన చర్యలు అవసరం. ఈసారి గతంలోవలె మనదేశంలో అంతగా ప్రభావం చూపబోదని శాస్త్రవేత్తలు, వైద్యనిపుణులు చెప్తున్నారు. యుద్ధం ఉక్రెయిన్‌ను ధ్వంసం చేసింది. ప్రపంచవ్యాప్తంగా ముడిచమురు సరఫరా రాజకీయ అంశంగా మారింది. ఐరోపా రష్యా చమురు విక్రయాలపై ఆంక్షలు విధించడంతో దాని దుష్ప్రభావం చాలా విస్తృతంగా ఏర్పడింది. ఆహార తదితర వస్తువుల సరఫరాలు తగ్గి ధరలు పెరిగాయి. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం పెరుగుతోంది. ఆర్థికమాంద్యం అన్ని దేశాల్లో ప్రజలను కష్టాలకు గురిచేస్తోంది. బ్యాంకురేట్లు పెంచినందున ద్రవ్యోల్బణం, నిరుద్యోగం పెరుగుతోంది. ఆర్థికమాంద్యం అన్ని దేశాల్లో ప్రజలను కష్టాలకు గురిచేస్తోంది. బ్యాంకు రేట్లు పెంచినందున ద్రవ్యోల్బణం కట్టడికాబోదని, ప్రజలందరి కొనుగోలు శక్తిని ప్రత్యేకించి భారతదేశంలో పెంపొందిస్తే ద్రవ్యోల్బణం తగ్గుతుందని అమెరికా ఆర్థిక శాస్త్రవేత్త స్టిగ్లిడ్జ్ నొక్కి చెప్పారు.

గతంలో మూడుదశల్లో అన్ని రంగాలను కుదేలు పరిచిన కోవిడ్-19 మహమ్మారి మరో రకం బిఎఫ్7 చైనాను అతలాకుతలం చేస్తోంది. ఈ విషయాన్ని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ కూడా సోమవారం ప్రకటించారు. అప్పటి సంక్షోభ పరిస్థితుల నుంచి ఇంకా పూర్తిగా కోలుకోకముందే కరోనా బిఎఫ్-7 ప్రజలను భయపెడుతోంది. ప్రజల జీవనంపై మళ్లీ చీకట్లు కమ్ముకుంటాయా అని ఆందోళన చెందుతున్నారు. కరోనా విజృంభించక ముందే ప్రభుత్వాలు అన్ని ప్రజా జీవనరంగాలపైన ముఖ్యంగా అన్ని రకాల రవాణా, ప్రజలు ఎక్కువమంది ఒక చోట చేరడంలాంటి వాటిపై కఠిన ఆంక్షలు అమలుచేసి సామూహికంగా కరోనావైరస్ విస్తరించకుండా నిలువరించాలి. ప్రపంచవ్యాప్తంగా వృద్ధిరేటు మందగించి దాని ప్రభావం మనదేశంలో వాణిజ్యం, ఆర్థికరంగాలపై తీవ్రంగా ఉండవచ్చునని నిపుణులు అంచనా వేస్తున్నారు. కరోనా మహమ్మారి అనంతరం 2021-22 ఆర్థిక సంవత్సరంలో జీడిపి వృద్ధి 8.7శాతంగా నమోదైంది. లేబరుమార్కెట్ పుంజుకోవడం, ప్రైవేటురంగం తీసుకునే రుణాల పెరుగుదల మూలంగా వృద్ధిరేటు కొనసాగింది. కొత్తగా ఎదురయ్యే ఆర్థిక అడ్డంకులను ద్రవ్యోల్బణం, ఒత్తిళ్లు, ప్రపంచ ఆర్థిక పరిస్థితులు మాంద్యంలోకి జారుతుండటం. ఉక్రెయిన్-రష్యా యుద్ధం వల్ల మరింత సంక్షోభం, రష్యా చమురు సరఫరా ఖరీదుపై ఆంక్షల విధింపు నేపథ్యంలో వీటిని చక్కబరిచేందుకు ప్రకటించిన ఆర్థికవిధానాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ప్రస్తుతం జీడీపీ 6.8శాతం ఉందని, 2022-23లో 6.1శాతానికి తగ్గుతుందని ఐఎంఎఫ్ అంచనా వేసింది. 2023-24 సంవత్సరంలో ధరల ఒత్తిడి తదితరాలవల్ల ద్రవ్యోల్బణం రేటు 6.9శాతం ఉంటుందని కూడా ఐఎంఎఫ్ ప్రకటించింది. కరెంట్ అకౌంట్‌లోటు 3.5శాతానికి పెరగవచ్చునని తెలిపింది.

2023 ఫిబ్రవరి-డిసెంబరు మధ్యకాలంలో తొమ్మిది రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరగనుండగా పత్రికలకు విచ్చలవిడిగా పేజీలకు పేజీలు 'అభివృద్ధి' ప్రకటనలు జారీ చేస్తున్నారు. ఇదంతా ప్రజల కష్టార్జితమే. ఉత్తిత్తి అభివృద్ధిని ప్రచారం చేయడం బీజేపీకి, ఆ పార్టీ అధికారంలోని రాష్ట్రాలకు బాగా అలవాటైంది. ఒకవేళ కరోనా వైరస్ విస్తరించినా ఎన్నికల ప్రచారానికి మోదీ వెనుకాడరని గత అనుభవం స్పష్టం చేస్తోంది. పశ్చిమబెంగాల్, బిహార్ రాష్ట్రాలతో వివిధ రాష్ట్రాల ఎన్నికల సభల్లో ప్రసంగించిన మోదీ, అమిత్‌షాలు కారకులయ్యారన్న విమర్శలను పాలకులు పట్టించుకోలేదు. ఇప్పుడు జీ-20 దేశాల అధ్యక్ష బాధ్యతలను స్వీకరించాక అదేదో గొప్ప విజయం సాధించినట్లుగా బీజేపీ ప్రచారం చేసుకొంది. ఇంట్లో ఈగల మోత బైట పల్లకీల మోత లాగా మోదీ సాధించిన విజయాలున్నాయనేది స్పష్టం. ఈ దశలో ప్రతిపక్షాల ఐక్యఫ్రంట్ ఏర్పడి 2024 లోక్‌సభ ఎన్నికల్లో మోదీని నిలువరించి స్వాతంత్ర్యాన్ని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించాలని కోరుకుందాం.

-ఎడిట్ డెస్క్

పెట్టుబడుల ఉపసంహరణ సాకుతో

పీఎస్‌యూలు నిర్వీర్యం

రూ.4 లక్షల కోట్ల ఆస్తుల అమ్మకం

మిత్రులకే కట్టబెడుతున్న మోదీ సర్కారు

న్యూఢిల్లీ: మోదీ సర్కారు దేశాన్ని ప్రైవేట్ రంగానికి కట్టబెట్టడానికి పూనుకున్నట్లు కనిపిస్తున్నది. మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఒక్క ప్రభుత్వ రంగ సంస్థను ఏర్పాటు చేయలేకపోయినా...దేశంలో అనేక ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోంది. దీనికి పెట్టుబడుల ఉపసంహరణ అని ముద్దుగా పేరు పెట్టింది. ఈ ఎనిమిదేళ్లలో 4.04 లక్షల కోట్ల రూపాయల ప్రభుత్వ రంగసంస్థల(పీఎస్‌యూ) ఆస్తులను మోదీ ప్రభుత్వం అమ్మేసింది. వీటి విలువ ఇంకా ఎక్కువేనని, తన కార్పొరేట్ మిత్రులకు కారుచౌకగా ధారాదత్తం చేసినట్లు కేంద్రంపై వామపక్షాలు, ఇతర విపక్షాలు, కార్మికసంఘాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ప్రభుత్వరంగ సంస్థల్లో ఉన్న పెట్టుబడులు అమ్మేసి ఆదాయం సమకూర్చుకునే ప్రభుత్వం ప్రజలకు ఏమి మేలు చేస్తుందని ప్రశ్నిస్తున్నాయి. ఆదాయం కావాలంటే ఆస్తులు అమ్ముకోవాల్సిందేనని, మరో మార్గం లేదని మోదీ సర్కారు విచిత్ర వాదనను తెరపైకి తీసుకొస్తోంది. గతంలో ఇదే విషయంలో కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు చేసిన ప్రధాని నరేంద్ర మోదీ... ఇప్పుడు అంతకంటే ఎక్కువగా పెట్టుబడులు ఉపసంహరించుకుంటున్నారు. బీజేపీ సర్కార్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉపసంహరించిన పెట్టుబడులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. యూపీఏ ప్రభుత్వం విక్రయించిన ఆస్తులకంటే నాలుగు రెట్లు ఎక్కువగా ప్రభుత్వరంగ సంస్థల ఆస్తులను, వాటాలను మోదీ ప్రభుత్వం అమ్మేసింది. యూపీఏ పదేళ్ల కాలంలో పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా రూ.1,14,045 కోట్లు మాత్రమే సేకరించింది. దీనిపై అప్పట్లో బీజేపీ పెద్ద గొడవే చేసింది. కాంగ్రెస్ దేశాన్ని సర్వనాశనం చేస్తున్నదని విమర్శలు గుప్పించింది. ఇప్పుడు అధికారం చేపట్టాక అడ్డూ అదుపూ లేకుండా అమ్మకాలు కొనసాగిస్తున్నది. మొత్తం 59 కంపెనీల్లో తమ వాటాను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిలో విక్రయించడం ద్వారా రూ.1.07 లక్షల కోట్లు సేకరించినట్టు ఆర్థికశాఖ అధికారికంగా ప్రకటించింది. ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లు (ఈటీఎఫ్) ద్వారా 10 విడతల్లో వాటాలు అమ్మేసి రూ.98,949 కోట్లు సేకరించింది. ఎయిర్ ఇండియా సహా 10 సంస్థల్లో వ్యూహాత్మక వాటా విక్రయం ద్వారా రూ.69,412 కోట్లు రాబట్టింది. మోదీ తన ఎనిమిదేళ్ల పాలనలో 45 కంపెనీల షేర్ల బైబ్యాక్ ప్రక్రియ ద్వారా ప్రభుత్వ వాటా అమ్మి మరో రూ.45,104 కోట్లు సేకరించింది. పారదీప్ ఫాస్ఫేట్, ఐపీసీఎల్, టాటా కమ్యూనికేషన్‌లో ప్రభుత్వానికి గల స్వల్ప వాటాలు మొత్తం రూ.9,538 కోట్లకు మోదీ సర్కారు అమ్మేసింది. 2014-15 ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటివరకు 17 కేంద్ర ప్రభుత్వ సంస్థల వాటాలను ఐపీఓ ద్వారా విక్రయించగా రూ.50,386 కోట్లు లభించాయి.

అధికారంలోకి రావడానికి ఇష్టానుసారంగా హామీలిచ్చిన బీజేపీ...ఇప్పుడు వాటిని పూర్తిగా విస్మరించింది. ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా తన అనుయాయులకు కట్టబెడుతోందన్న విమర్శలు సుదీర్ఘకాలంగా వింటున్నాం. జాతీయ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్నట్లు సర్వత్రా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. రైల్వే, రక్షణరంగం, చమురు, విద్యుత్, జాతీయ రహదారులు తదితర రంగాలను ప్రైవేటు నిర్వహణకు ఇవ్వబోతున్నారన్న వార్తలు ఊపందుకున్నాయి.

అభివృద్ధి చెందిన దేశాలు ప్రభుత్వరంగ సంస్థలను బలోపేతం చేసేలా చర్యలు చేపడుతుండగా భారత్‌లో మాత్రం అందుకు భిన్నంగా ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేసేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుండటం విచారకరం. ప్రైవేటు పెట్టుబడులు ఇబ్బడి ముబ్బడిగా ప్రవేశించడానికి వీలుకల్పిస్తూ ప్రైవేటీకరణకు మార్గాన్ని సుగమం చేసేలా ప్రభుత్వరంగ సంస్థల నుండి పెట్టుబడుల ఉపసంహరణపై ప్రభుత్వం నిర్దిష్ట లక్ష్యాలు ప్రకటించడం అత్యంత బాధాకరం. ఇంతకుముందు ఖాయిలాపడిన సంస్థలను విక్రయించడం జరుగుతుండేది. కానీ మోదీ హయాంలో లాభాల బాటలో పయనించే సంస్థలను సైతం ప్రైవేటు పరం చేస్తోంది. బీమా, వైద్యం వంటి కీలక రంగాల్లోనూ ప్రైవేటుకు పెద్దపీట వేస్తున్నది. ప్రభుత్వ రంగ సంస్థల 'వ్యూహాత్మక విక్రయం' ద్వారా నిధుల సేకరణ బీజేపీ దిగజారుడు వైఖరికి నిదర్శనమన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సత్తా లేకే ఇతరుల పార్టీ లాక్కున్నారు

ఏక్‌నాథ్ షిండేపై ఉద్ధవ్ మండిపాటు

నాగపూర్: మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్‌షిండేపై ఓ వర్గం శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే విరుచుకుపడ్డారు. ఏమీ సాధించే ధైర్యం లేనివారు మాత్రమే దొంగతనం, ఆక్రమణకు పాల్పడతారని విమర్శించారు. దక్షిణ ముంబైలోని బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్(బీఎంసీ) ప్రధాన కార్యాలయంలోని పార్టీ ఆఫీసు వద్ద శివసేన రెండు వర్గాలు ఘర్షణ పడిన మరుసటి రోజు ఉద్ధవ్ ఈ వ్యాఖ్యలు చేశారు. రెండు వర్గాల ఘర్షణతో గంటకు పైగా అక్కడ ఉద్రిక్తత ఏర్పడింది. పోలీసుల జోక్యంతో పరిస్థితి సద్దుమణిగింది. ఉద్ధవ్ ఠాక్రే గురువారం అసెంబ్లీ ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ రూ.52 వేల కోట్ల అనుబంధ పద్దులపై ప్రభుత్వం సరైన సమాధానం చెప్పలేదని విమర్శించారు. విదర్భ ప్రాంతానికి ప్రోత్సాహాలు, అకాల వర్షాలతో దెబ్బతిన్న రైతులకు సాయం అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, కనీసం సమాధానం కూడా చెప్పడం లేదని మండిపడ్డారు. సీఎం ఏక్‌నాథ్ షిండే పేరు నేరుగా ప్రస్తావించకుండానే ఆయనపై ఆరోపణలు గుప్పించారు. సొంతగా పార్టీని స్థాపించలేరు. కార్యాలయాలు ఏర్పాటు చేసుకోలేరు. అంతటి ధైర్యం వారికి లేనేలేదు. అందుకే ఇతరుల పార్టీలను, కార్యాలయాలను లాక్కుంటారు. వారికి ఆత్మన్యూనతా భావం ఉంటుందని ఠాక్రే అన్నారు. షిండే వర్గానికి చెందిన ఎంపీ రాహుల్ షెవాలే, నాయకులు యశ్వంత్ జాదవ్, శీతల్ హత్రే బుధవారం సాయంత్రం బీఎంసీలోని పార్టీ కార్యాలయంలోకి ప్రవేశించడంతో రెండు వర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది.

గురువాయూర్ ఆలయానికి భారీగా ఆస్తులు

త్రిస్సూర్(కేరళ): కేరళలో శ్రీపద్మనాభస్వామి ఆలయం తరహాలోనే గురువాయూర్ ఆలయానికి భారీగా ఆస్తులు ఉన్నాయి. ఈ ఆలయానికి రూ.1737 కోట్ల బ్యాంక్ డిపాజిట్లు, 271 ఎకరాల భూములు ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. త్రిస్సూర్ జిల్లాలో గురువాయూర్ శ్రీకృష్ణ ఆలయం ఉంది. ఆలయం పేరుపై భారీగా ఆస్తులు ఉన్నట్లు ఆర్‌టీఐ ద్వారా తెలిసింది. గురువాయూర్ ఆలయానికి భక్తులు భారీగా విరాళాలు ఇస్తారు. బంగారం, వెండి, ఇతర విలువైన రాళ్లు ఉన్నట్లు ఆర్‌టీఐ తెలిపింది. అయితే, భద్రతా కారణాల సాకుతో ఆలయ యాజమాన్యం వీటి వివరాలు వెల్లడించడానికి నిరాకరించినట్లు పేర్కొంది. ఇది శతాబ్దాల నాటి ఆలయం. కృష్ణుడుగా విష్ణును ఇక్కడ పూజిస్తారు. యేటా వేలాదిమంది ఈ ఆలయాన్ని సందర్శిస్తారు. గురువాయూర్ వాసి, ప్రాపర్ చానల్ సంస్థ అధ్యక్షుడు హరిదాస్ ఆర్‌టీఐ ద్వారా ఆస్తుల వివరాలు అడిగారు. దీంతో ఆలయానికి సంబంధించిన ఆస్తులు వెలుగులోకి వచ్చాయి. గురువాయూర్ దేవస్థానం చెప్పిన వివరాల ప్రకారం దానికి 271 ఎకరాల భూమి ఉన్నట్లు ఆర్‌టీఐ తెలిపింది. అయితే, దీని విలువను యాజమాన్యం అంచనా వేయలేదని చెప్పింది. వివిధ బ్యాంకుల్లో రూ.1737 కోట్ల డిపాజిట్లు ఉన్నాయని మరో ప్రశ్నకు సమాధానంగా తెలిపింది. పినరయి విజయన్ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ఆర్థిక సాయం ఏమీ అందలేదని ఆలయ యాజమాన్యం వెల్లడించింది.

బీజేపీ, కాంగ్రెస్ ఒకటే: అఖిలేశ్

లక్నో: బీజేపీ, కాంగ్రెస్ ఒకటేనని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ చేపట్టిన 'భారత్ జోడో యాత్ర'పై ఆయన ఈ మేరకు స్పందించారు. విరామం తర్వాత జనవరి 3న ఢిల్లీ నుంచి తిరిగి కొనసాగనున్న ఈ యాత్ర ఢిల్లీ అనంతరం ఉత్తరప్రదేశ్‌లోకి ప్రవేశించనున్నది. ఈ నేపథ్యంలో ప్రతిపక్షంలో కీలకంగా ఉన్న యూపీకి చెందిన ప్రధాన ప్రతిపక్ష పార్టీ సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, బీఎస్పీ అధినేత్రి మాయావతిని 'భారత్ జోడో యాత్ర'లో పాల్గొనాలని కాంగ్రెస్ పార్టీ ఆహ్వానించినట్లు తెలిసింది. జోడో యాత్రలో పాల్గొంటారా? అని మీడియా అడిగిన ప్రశ్నకు అఖిలేశ్ స్పందిస్తూ, 'మా పార్టీది భిన్నమైన సిద్ధాంతం. బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటే' అని తెలిపారు. అంతటితో ఆగక 'మీ ఫోన్‌లో ఆహ్వానం ఉంటే, దయచేసి నాకు పంపండి' అని విలేకరులతో అన్నారు. 'భారత్ జోడో యాత్ర'లో పాల్గొనాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నుంచి తనకు ఎలాంటి ఆహ్వానం అందలేదని స్పష్టం చేశారు. అయితే తమ మనోభావాలు వారి (కాంగ్రెస్) యాత్రతో ఉంటాయని చెప్పారు.

పంజాబ్ మిల్క్ ప్రాసెసింగ్ బిజినెస్ గ్రూప్‌పై ఈడీ దాడి

న్యూఢిల్లీ: బ్యాంక్ రుణాలకు సంబంధించి మనీలాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న పంజాబ్‌కు చెందిన వ్యాపారవేత్త కార్యాలయాల్లో సోదాలు నిర్వహించడగా, రూ.1.15 కోట్ల డబ్బు, మొబైల్ ఫోన్లు, ఆస్తుల పత్రాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తెలిపింది. ప్యూర్ మిల్క్స్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (పీఎంపీపీఎల్)కు చెందిన డైరెక్టర్లు చరణ్‌జిత్‌సింగ్ బజాజ్, లివతార్ బజాజ్, గుర్‌దీప్ కౌర్, వారికి చెందిన సిబ్బంది, వారి కార్యాలయాలకు చెందిన 11 ప్రాంతాల్లో డిసెంబరు 27న సోదాలు చేయడం మొదలుపెట్టామని ఈడీ వివరించింది నిందితుడపై గతంలో సీబీఐ మనీలాండరింగ్ కేసు నమోదు చేయగా, ప్రస్తుతం ఈడీ దర్యాప్తు చేస్తోంది.

విద్యార్థిని చేయి విరగ్గొట్టిన ఉపాధ్యాయుడి అరెస్టు

భోపాల్: భోపాల్‌లో ప్రైవేట్ ట్యూషన్ చెప్పే ఉపాధ్యాయుడు 'చిలుక' అనే పదాన్ని సరిగ్గా రాయలేదని ఆరోపిస్తూ చేతిని మెలితిప్పడంతో ఐదేళ్ల బాలికకు ఫ్రాక్చర్ అయినట్లు పోలీసులు గురువారం తెలిపారు. మంగళవారం ఈ ఘటన జరగడంతో టీచర్‌ను అరెస్టు చేసినట్లు వారు తెలిపారు. నిందితుడు, ప్రయాగ్ విశ్వకర్మ, మైనర్ చేతిని మెలితిప్పినట్లు ఆరోపిస్తూ, ఆమె 'చిలుక' అనే పదాన్ని ఉచ్చరించలేనందున చెంపదెబ్బ కొట్టినట్లు హబీబ్‌గంజ్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మనీష్ రాజ్ సింగ్ భదౌరియా తెలిపారు. ఉపాధ్యాయుడు అమ్మాయి చేతిని దారుణంగా తిప్పడంతో అది విరిగిపోయింది. ఘటన తర్వాత బాలికను ఆసుపత్రిలో చేర్చామని, గురువారం డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందని ఎన్జీఓ చైల్డ్‌లైన్‌కు చెందిన అర్చనా సహాయ్ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు ఇన్‌స్పెక్టర్ భదౌరియా తెలిపారు. బాధితురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు మంగళవారం అతడిని అరెస్టు చేశారు.

స్వల్పంగా పెరిగిన కరోనా కేసులు

న్యూఢిల్లీ: దేశంలో కరోనా కేసులు గురువారం స్వల్పంగా పెరిగాయి. గత 24 గంటల్లో 1,34,995 కొవిడ్ నిర్ధారణ పరీక్షలు చేయగా... 268 కొత్త కేసులు బయటపడినట్లు కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ వెల్లడించింది. దీంతో దేశవ్యాప్తంగా మొత్తం కేసుల సంఖ్య 4,46,77,647కి చేరింది. ఇక ఇప్పటి వరకు 4,41,43,665 మంది కరోనా మహమ్మారి నుంచి కోలుకున్నారు. ప్రస్తుతం దేశంలో 3,552 క్రియాశీల కేసులు ఉన్నాయి. గత 24 గంటల్లో ఇద్దరు మృతి చెందగా, మొత్తం మరణాల సంఖ్య 5,30,698కి చేరింది. ఇప్పటివరకు నమోదైన మొత్తం పాజిటివ్ కేసుల్లో 0.01 కేసులు మాత్రమే క్రియాశీలంగా ఉన్నాయని వెల్లడించింది. రికవరీ రేటు 98.80 శాతంగా, మరణాలు 1.19 శాతంగా ఉన్నాయని పేర్కొన్నది. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 220.08 కోట్ల కరోనా వాక్సిన్ డోసులను పంపిణీ చేశామని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ వెల్లడించింది.

కేంద్ర దర్యాప్తు సంస్థల అధికార దుర్వినియోగం

శరద్‌పవార్ విమర్శ

ముంబై: కేంద్ర దర్యాప్తు సంస్థలు తమకున్న అధికారాన్ని దుర్వినియోగపరుస్తున్నాయని గత కొన్నాళ్లుగా అనేక రాజకీయ పక్షాలు ఆరోపిస్తూనే ఉన్నాయి. కేంద్రంలో అధికారంలో ఉండే పార్టీలు కేంద్ర దర్యాప్తు సంస్థలను తమ చెప్పుచేతల్లో పెట్టుకుని మిగతా పక్షాల నేతలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని చాలా ఏళ్లుగా వింటున్నాం. ఇటీవలి కాలంలో ఈ విపరీత ధోరణులు మరీ ఎక్కువయ్యాయి. తమ మాట వినని నేతలను, తమకు మద్దతు ఇవ్వని పార్టీలను అణగదొక్కేందుకు కేంద్రంలోని ప్రభుత్వాలు వివిధ దర్యాప్తు సంస్థల సాయం తీసుకుంటున్నాయి. ఆయా సంస్థల పనితీరుపై విమర్శలు వస్తున్నా 'నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు..' అన్న చందంగా వ్యవహరిస్తూ అభాసుపాలవుతున్నాయని ఎన్సీపీ అధినేత శరద్‌పవార్ ఆందోళన వ్యక్తంచేశారు. కేంద్ర దర్యాప్తు సంస్థ తీరుతో తమ సీనియర్ నేత ఏడాది కాలంగా జైలులో ఉన్నారని తెలిపారు. ముంబైలోని ఆర్థర్ రోడ్ జైలు నుంచి బుధవారం విడుదలైన హోం శాఖ మాజీ మంత్రి అనిల్ దేశ్‌ముఖ్ గురువారం శరద్ పవార్‌తో భేటీ అయ్యారు. జైలుకు వెళ్లాల్సి వచ్చిన పరిస్థితులు, జైలులో ఎదుర్కొన్న అవమానాలను ఆయన పవార్‌కు వివరించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో దేశ్‌ముఖ్‌కు బెయిల్ ఇవ్వడంపై పవార్ సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తున్నది.

అనిల్ దేశ్‌ముఖ్‌ను కేంద్ర దర్యాప్తు సంస్థల 'అధికార దుర్వినియోగానికి' ఉదాహరణగా శరద్ పవార్ అభివర్ణించారు. ఈ సమస్యను ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా దృష్టికి తీసుకెళ్లాలని ఆయన యోచిస్తున్నాడు. త్వరలోనే మోదీని కలుసుకుని దర్యాప్తు సంస్థ అధికార దుర్వినియోగంపై ఫిర్యాదు చేయనున్నట్లు శరద్ పవార్ వెల్లడించారు. కేంద్ర దర్యాప్తు సంస్థ ఆగడాలకు అనిల్ దేశ్‌ముఖ్ ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నారని పవార్ చెప్పారు. అధికారాన్ని ఎలా దుర్వినియోగం చేశారో అనిల్ దేశ్‌ముఖ్ కేసులో స్పష్టంగా కనిపిస్తున్నదన్నారు. దేశ్‌ముఖ్‌కు వ్యతిరేకంగా ఎలాంటి సాక్ష్యాధారాలు లేవని కోర్టు తన ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నదని పవార్ తెలిపారు. తొలుత దాదాపు రూ.100 కోట్లు వసూలు చేశారని ఆరోపణలు వచ్చాయి, కానీ ఛార్జిషీట్‌లో ఆ సంఖ్య రూ.1 కోటికి తగ్గిందని పేర్కొన్నారు. దేశ్‌ముఖ్ ఎదుర్కొన్న పరిస్థితులు మరొకరికి రాకుండా ఉండేందుకే ప్రధాని దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పవార్ స్పష్టం చేశారు.

కరోనా వచ్చిన విదేశీయుడు అదృశ్యం

ఆగ్రా: ఈనెల 26న ఆగ్రాలోని తాజ్‌మహల్‌ను చూసేందుకు వచ్చిన విదేశీ పర్యాటకుడికి కరోనా నిర్ధారణ అయ్యింది. అయితే ప్రస్తుతం అతను అదృశ్యమైనట్లు ఆరోగ్యశాఖ అధికారులు గురువారం తెలిపారు. దీనిపై ఆగ్రా చీఫ్ మెడికల్ ఆఫీసర్ (సీఎంఓ) డా॥ అరుణ్ శ్రీవాస్తవ మాట్లాడుతూ అతడిని పట్టుకోవడం అసాధ్యమని, అతని అందజేసిన వివరాలన్నీ మోసపూరితమేనని పేర్కొన్నారు. 'తాజ్‌మహల్‌ను సందర్శించేందుకు విదేశాలనుంచి పర్యాటకుడు ఒకరు వచ్చారు. ఆయనకు తాజ్‌మహల్ గేట్ వద్ద కోవిడ్ పరీక్ష నిర్వహించాం. ఆర్‌టీపీసీఆర్ టెస్ట్‌లో అతనికి కరోనా ఉందని నిర్ధారణ అయ్యింది. అయితే పర్యాటకుడు ఇచ్చిన చిరునామా, ఫోన్ నెంబర్ తప్పు. దీంతో ఇప్పటి వరకూ అతడిని గుర్తించలేకపోయాం' అని శ్రీవాస్తవ తెలిపారు. లోకల్ ఇంటెలిజెన్స్ యూనిట్, హోటళ్ల అసోసియేషన్‌లతో సంయుక్తం అతడిని వెదుకుతున్నామన్నారు. అతడి లొకేషన్‌ను పట్టుకునేందుకు ఆగ్రా ఆరోగ్యశాఖ తీవ్ర కసరత్తు చేస్తోందని, అతడిని పట్టుకుని వైద్యం చేసినట్లయితే ఇతరులకు ఇన్‌ఫెక్షన్ సోకకుండా చేయవచ్చునని అరుణ్ అన్నారు. అలాగే విదేశీ పర్యాటకుల వివరాలను ఇవ్వమని హోటళ్ల అసోసియేషన్‌ను కూడా అడిగామని, పోలీసుల సాయం తీసుకుంటున్నామని, లోక్ ఇంటెలిజెన్స్ యూనిట్ సహాయంతో అతడిని పట్టుకునేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఇదిలా ఉంటే, ఇకపై విదేశీ పర్యాటకులు ఎవరు వచ్చినా, సరైన గుర్తింపు కార్డుల లేకుండా అనుమతించే ప్రసక్తే లేదని, శాంపిల్ తీసుకున్న తరువాతే లోపలికి అనుమతించాలని అరుణ్ పేర్కొన్నారు.

ఇద్దరు మావోయిస్టుల అరెస్టు

దంతెవాడ: చత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో హత్య కేసుల్లో నిందితులుగా ఉన్న ఇద్దరు మావోయిస్టులను అరెస్టు చేసినట్లు పోలీసులు గురువారం తెలిపారు. ఒక్కొక్కరిపై రూ.10వేల రివార్డు ఉందని పేర్కొన్నారు. జిల్లా రిజర్వ్ గార్డ్, చత్తీస్‌గఢ్ ఆర్మ్‌డ్ ఫోర్స్ సంయుక్త బృందం బుధవారం అరన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గాలింపు చర్యలు చేపట్టగా, ఇద్దరు మావోయిస్టులు గొండెరాస్ గ్రామ సమీపంలోని అడవిలో తప్పించుకోవడానికి ప్రయత్నించారని దంతెవాడ అదనపు పోలీసు సూపరింటెండెంట్ ఆర్‌కె. బర్మాన్ తెలిపారు.

పెరిగిన ఉష్ణోగ్రత... చలిగాలుల నుంచి ఉపశమనం

శ్రీనగర్: కశ్మీర్‌లో చలిగాలుల నుంచి ఉపశమనం లభించింది. లోయ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగినట్టు అధికారులు తెలిపారు. గురువారం నుంచి రెండు రోజుల పాటు అక్కడక్కడా తేలికపాటి నుంచి ఓ మోస్తరు మంచు కురిసే అవకాశం ఉందని వారు తెలిపారు. కశ్మీర్ అంతటా రాత్రి ఉష్ణోగ్రతలో కొంత మెరుగుదల కనిపించింది. మూడు డిగ్రీలు ఎండ పెరగడంతో తీవ్రమైన చలి నుంచి స్వల్ప ఉపశమనం లభించింది. శ్రీనగర్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రత మైనస్ 3.2 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. బుధవారం రాత్రి మైనస్ 5.6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైందని అధికారులు తెలిపారు. పహల్గామ్‌లో మైనస్ 4.5 డిగ్రీల సెల్సియస్, మైనస్ 7.4 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఉత్తర కశ్మీర్‌లోని బారాముల్లా జిల్లాలోని గుల్‌మార్గ్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రత మైనస్ 4.8 డిగ్రీల సెల్సియస్, మైనస్ 6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. సరిహద్దులోని కుప్వారా జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రత మైనస్ 3.3 డిగ్రీల సెల్సియస్‌గా, ఖాజిగుండ్‌లో 3.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైందని అధికారులు తెలిపారు. కోకెర్‌నాగ్‌లో మైనస్ 2.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. దక్షిణ కశ్మీర్‌లోని పహల్గామ్, పరిసర ప్రాంతాలలో కొద్దిసేపు మంచు కురుస్తున్నప్పటికీ, డిసెంబరు నెలాఖరు వరకు వాతావరణం పొడిగా ఉంటుందన్నారు.

నెగెటివ్ రిపోర్ట్ ఉండాల్సిందే: కేంద్రం

న్యూఢిల్లీ: చైనా, హాంకాంగ్, జపాన్, ఉత్తర కొరియా, సింగపూర్, థాయ్‌లాండ్ నుంచి వచ్చే విమాన ప్రయాణికులందరూ జనవరి 1 నుంచి కరోనా నెగెటివ్ నివేదిక ఉండాల్సిందేనని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి మనసుఖ్ మాండవీయ గురువారం స్పష్టం చేశారు. బయలుదేరేముందు ఆర్‌టీపీసీఆర్ టెస్టు చేయించుకుని నెగెటివ్ రిపోర్టులు ఎయిర్ సువిధ పోర్టల్‌లో విధిగా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఆ టెస్టలన్నీ భారత్‌కు వచ్చే 72గంటల ముందు చేయించుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అయితే వీటికి విమానాశ్రయాల్లో చేసే టెస్టులు అదనమని ఆయన వివరించారు. విదేశాల్లో కరోనా మహమ్మారి మళ్లీ విజృంభిస్తున్న కారణంగా కేంద్రం కరోనా నిబంధనలను మరింత కట్టుదిట్టం చేసింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించింది. ప్రస్తుతం 268 తాజా కేసులు నమోదవ్వగా, మొత్తం 3,552కు చేరుకున్నట్టు కేంద్ర ఆరోగ్యశాఖ తెలిపింది.

కోలుకున్న ప్రధాని తల్లి

అహ్మదాబాద్: ప్రధాని నరేంద్ర మోదీ తల్లి హీరాబెన్ కోలుకుంటున్నారని అహ్మదాబాద్‌లోని ఆసుపత్రి గురువారం తెలిపింది. హీరాబెన్ (99) కొన్ని ఆరోగ్య సమస్యల కారణంగా బుధవారం ఉదయం యూఎన్ మెహతా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్డియాలజీ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో చేరారు. ప్రధాని మోదీ బుధవారం మధ్యాహ్నం ఢిల్లీ నుంచి అహ్మదాబాద్ చేరుకుని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి వెళ్లి తన తల్లిని పరామర్శించారు. దాదాపు గంటకు పైగా ఆయన ఆస్పత్రిలోనే ఉన్నారు. మోదీ సోదరుడు సోమాభాయ్ మోదీ మాట్లాడుతూ, తమ తల్లి పరిస్థితి క్రమంగా మెరుగుపడుతోందని, ఆమె ఉదయం ద్రవ ఆహారం తీసుకున్నారని చెప్పారు. ప్రధాని తల్లి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఆస్పత్రి బుధవారం వెల్లడించింది. హీరాబెన్ గాంధీనగర్ సమీపంలోని రైసన్ గ్రామంలో ప్రధాని మోదీ తమ్ముడు పంకజ్ మోదీతో కలిసి నివసిస్తున్నారు. ప్రధానమంత్రి తన గుజరాత్ పర్యటనలలో చాలా వరకు రైసన్‌ను సందర్శించి, ఆమె తల్లితో సమయం గడిపారు.

1.53 లక్షల మంది దుర్మరణం

రోడ్డు ప్రమాదాలపై ప్రభుత్వ నివేదిక

న్యూఢిల్లీ: గతేడాది దేశంలో జరిగిన రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన నివేదికను కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ వెల్లడించింది. దేశంలో రోడ్డు ప్రమాదాల్లో 1,53,972 మంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపింది. 3,84,448 మంది గాయపడినట్లు పేర్కొంది. 4,12,432 రోడ్డు ప్రమాదాలు జరిగాయని నివేదిక వివరించింది. 'భారతదేశంలో రోడ్డు ప్రమాదాలు-2021' అనే పేరుతో ప్రభుత్వం ఈ కొత్త నివేదిక విడుదల చేసింది. 2019తో పోలిస్తే 2021లో రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గిందని నివేదిక పేర్కొంది. ఈ ప్రమాదాలు 8.1 శాతం మేరకు తగ్గాయని, క్షతగాత్రుల సంఖ్య కూడా 14.8 శాతానికి తగ్గిందని తెలిపింది. ప్రాణాంతకమైన రోడ్డు ప్రమాదాల సంఖ్య 1.9 శాతం మేరకు పెరిగినట్లు వెల్లడించింది. 2020తో పోలిస్తే 2021లో రోడ్డు ప్రమాదాలు 12.6 శాతం పెరిగాయి. మృతుల సంఖ్య, క్షతగాత్రుల సంఖ్య వరుసగా 16.9 శాతం, 10.39 శాతం వంతున పెరిగాయని నివేదిక తెలియచేసింది. ఈ గణాంకాల ఆధారంగా దేశంలో ప్రతి గంటకూ 18 మరణాలు, 47 ప్రమాదాలు సంభవించాయి. ప్రతి రోజూ సగటున 1,130 ప్రమాదాలు, 422 మరణాలు చోటుచేసుకున్నాయి. 2020లో దేశంలో ప్రమాదాలు, ప్రాణాంతక ప్రమాదాలు, క్షతగాత్రుల సంఖ్య గణనీయంగా తగ్గిందని నివేదిక తెలిపింది. కోవిడ్ మహమ్మారి విజృంభణ, లాక్‌డౌన్ వల్ల రోడ్లపై తిరిగేవారి సంఖ్య తగ్గటమే ఇందుకు కారణమని పేర్కొంది. ప్రత్యేకించి మార్చి, ఏప్రిల్ నెలల్లో ప్రమాదాలు తగ్గాయని చెప్పింది. 2021లో 18 నుండి 45 ఏళ్లలోపు వయసుగల యువకులు, వయోజనులు 67.6 శాతం రోడ్డు ప్రమాదాల్లో బాధితులుగా తేలారు. 18 నుండి 60 ఏళ్లలోపు వయసుగల పనులు చేసుకునే వర్గం 84.5 శాతం తీవ్రమైన రోడ్డు ప్రమాదాల పాలయ్యారు. 2021లో జాతీయ రహదారుల్లో 1,28,008 (31.2శాతం) రోడ్డు ప్రమాదాలు జరిగాయి. వీటిలో ఎక్స్‌ప్రెస్ హైవేల్లో 96,382 (23.4శాతం) సంభవించాయి. రాష్ట్ర రహదారులపై 1,87,225 ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. మొత్తం ప్రమాదాల సంఖ్య 4,12,432గా నమోదైంది. తమిళనాడులో జాతీయ రహదారులపై అత్యధికంగా 2021లో ఎక్కువ ప్రమాదాలు జరిగాయి. ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా మరణాలు సంభవించాయి. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన వల్ల 69.6 శాతం మంది మరణించారు. డ్రైవింగ్ లోపాల వల్ల 5.2 శాతం మంది మరణించారు.

మధ్యప్రదేశ్‌లో స్వైన్‌ఫ్లూ టెర్రర్

50 పందుల వధ

దామో: ఆఫ్రికా స్వైన్‌ఫ్లూ భయంలో మధ్యప్రదేశ్‌లోని దామో జిల్లాలో 50 పందులను వధించినట్లు ఓ అధికారి గురువారం తెలిపారు. ఆఫ్రికా స్వైన్‌ను గుర్తించిన క్రమంలో ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. వెయ్యికిపైగా వరాహాలను వధించే అవకాశమున్నట్లు రాష్ట్ర వెటరినరీ శాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది.

ఆఫ్రికన్ స్వైన్ ఫీవర్ సోకినట్లు మూడు రోజుల కిందట నిర్ధారణ కావడంతో దామో జిల్లాకు 35కిమీల దూరంలోని హటా ప్రాంతంలో కొన్ని పందుల నమూనాలు సేకరించి భోపాల్‌లోని ప్రభుత్వ ల్యాబ్‌కు పరీక్షల కోసం పంపినట్లు జిల్లా వెటరినరీ అధికారి బీకే అసతీ తెలిపారు. మరణాలు సంభవించిన ప్రాంతానికి కిలోమీటర్లు పరిధిలో ఉన్న పందులను వధించి, వాటి కళేబరాలను తగిన పద్ధతి ప్రకారం విసర్జించినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు 50 పందులను వధించామని, మొత్తం తొమ్మిది కిలోమీటర్ల పరిధి ప్రాంతంపై నిశిత నిఘా పెట్టామని అధికారి చెప్పారు.

రైతుల ఆదాయంపై శ్వేతపత్రం

మోదీ ప్రభుత్వానికి అఖిలభారత కిసాన్ కాంగ్రెస్ డిమాండ్

న్యూఢిల్లీ: రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని కేంద్రప్రభుత్వాన్ని అఖిలభారత కిసాన్ కాంగ్రెస్ దుయ్యబట్టింది. 2004 నుంచి రైతుల ఆదాయంపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేసింది. ప్రతిపక్ష కాంగ్రెస్ అనుబంధ ఈ సంస్థ చైర్మన్ సుఖ్‌పాల్ సింగ్ ఖైరా గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని బీజేపీ చెప్పినది మిథ్య... ఎన్డీయే హయాంలో రైతుల ఆదాయం తగ్గిందన్నారు. 'రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని 2016లో ప్రధాని మోదీ ప్రకటించడం జుమ్లా మాత్రమే. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసేహామీపై మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారు? అని సుఖ్‌పాల్ సింగ్ ప్రశ్నించారు. 2016లో ఏర్పాటైన కమిటీ సిఫార్సుల సంగతేమిటని నిలదీశారు. రైతుల ఆదాయంపై శ్వేతపత్రాన్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ నమూనా సర్వే-2018ను ప్రస్తావించారు. కాంగ్రెస్ నేతృత్వ యూపీఏ హయాంలో 2004-14లో రైతుల ఆదాయం రెట్టింపు కంటే ఎక్కువే పెరిగిందని చెప్పారు. రైతుల ఆదాయాన్ని నిర్ణయించడానికి పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) అన్నది ప్రాథమిక పరామితి అని తెలిపారు.

యూపీఏ అధికారంలోకి వచ్చిన ఎనిమిదేళ్లలో గోధుమ, ధాన్యం ఎంఎస్పీ రెట్టింపు అయిందని గుర్తుచేశారు. 2004లో క్వింటా గోధుమ ధర రూ.640 కాగా 2013-14లో అది రూ.1,400కు పెరిగిందన్నారు. అలాగే, ధాన్యం క్వింటా ధర 2004లో రూ.560గా ఉంటే 2013-14లో రూ.1,310కు చేరిందన్నారు. దీనికి పూర్తి భిన్నంగా బీజేపీ హయాంలో ఈ రెండు పంటల ఎంఎస్పీలు 50శాతాన్ని మించలేదని చెప్పారు.

మహిళా సాధికారతకు ప్రోత్సాహం

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

విశాలాంధ్ర-జూబ్లీహిల్స్: ప్రతి స్థాయిలో మహిళా సాధికారత ప్రోత్సహించాలని, అలాంటి సమాజమే ఆధునిక, అభివృద్ధి చెందిన సమాజంగా భావించబడుతుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. జి.నారాయణమ్మ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కాలేజ్ ఫర్ ఉమెన్ (షేక్‌పేట, హైదరాబాద్) రజతోత్సవం, ఆజాదీకా అమృత మహోత్సవ్ పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించారు. అనంతరం కాలేజీ చైర్మన్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ 25 ఏళ్ల క్రితం ఇంజినీరింగ్ కోర్సుల్లోకి ఎక్కువమంది మహిలలను తీసుకురావాలనే సమగ్ర దృక్పథంలో పుల్లారెడ్డి ఈ కళాశాలను ప్రారంభించారన్నారు. రజతోత్సవం సందర్భంగా భారత రెండో మహిళా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఆతిథ్యం ఇవ్వడం గర్వకారణమన్నారు. రాష్ట్రపతితోపాటు మనమంతా కృషి చేసి, ప్రతి మహిళకు చరిత్ర సృష్టించే అవకాశం ఉందన భరోసా ఇద్దామని ఆయన పిలుపునిచ్చారు. జీఎన్ఐటీఎస్ వైస్ చైర్‌పర్సన్ శ్రీవిద్యా రెడ్డి మాట్లాడుతూ సమాజంలోని వివిధ వర్గాల్లోని నాయకత్వ స్థానాల్లో ఎక్కువమంది మహిళలు ఉండేలా చూడాలని ఆమె కోరారు. 18వేలమంది జీఎన్ఐటీయన్లు పటిష్ఠమైన పూర్వ విద్యార్థుల నెట్‌వర్క్‌ను కలిగి ఉన్నారని, వారంతా పెద్ద కార్పొరేట్, పరిశోధన సంస్థలు, ప్రభుత్వ సంస్థల్లో అత్యున్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. రాష్ట్రపతి కెరీర్ నుంచి తామంతా స్ఫూర్తి పొందుతున్నామని, ఆమె కాలేజీ సందర్శన విజయవంతమైన, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎందడగానికి దేశంలోని యువకు స్ఫూర్తి, ప్రేరణ ఇస్తుందని ఆమె పేర్కొన్నారు. తెలంగాణ గవర్నర్, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్, ఈశాన్య ప్రాంత అభివృద్ధి, కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి, సికింద్రాబాద్ ఎంపీ జి. కిషన్ రెడ్డి, చైర్మన్ పి. సుబ్బారెడ్డి, జి. పుల్లారెడ్డి ఛారిటీస్ ట్రస్ట్ చైర్మన్ జి రాఘవరెడ్డి, జీపీఆర్ ఛారిటీస్ ట్రస్ట్ ట్రస్టీ జి. ఏకాంబర రెడ్డి, జీఎన్ఐటీఎస్ ప్రిన్సిపాల్ డా.రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

ముస్లిం బాలుడిపై హిందూత్వ దాడి

జైశ్రీరాం అనాలంటూ వేధింపులు- మధ్యప్రదేశ్‌లో ఘటన

ఖాండ్వా: హిందూత్వమూకల ఆగడాలకు అడ్డు-అదుపు లేకుండా పోయింది. మతతత్వ కళ్లద్దాలు పెట్టుకొని లోకాన్ని చూసే ప్రయత్నం చేస్తూ పిన్నలు, వృద్ధులు అన్న తేడా మర్చి అమానుషంగా దాడులకు తెగపడుతున్నారు. తాజాగా మధ్యప్రదేశ్‌లోని ఖాండ్వా జిల్లాలోని పంధానా ప్రాంతంలో పదేళ్ల ముస్లిం బాలుడిపై ఓ హిందూత్వవాది విరుచుకుపడాడు. జైశ్రీరాం అనాలంటే భౌతిక దాడి చేశాడు. ఐదో తరగతి చదువుతున్న బాలుడు బుధవారం సాయంత్రం ట్యూషన్ నుంచి ఇంటికెళుతుండగా మధ్యలో ఆపి అతనిపై నిందితుడు దాడి చేసినట్లు డీఎస్పీ అనిల్ సింగ్ చౌహాన్ తెలిపారు. నిందితుడిని గుర్తించామని, త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు. బాలుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అతనిపై ఐపీసీలోని 295ఎ, 323 సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశామన్నారు. నిందితుడు 21ఏళ్ల కార్మికుడని, ఘటనా సమయంలో మద్యం మత్తులో ఉన్నాడని, ఏ సంఘంతోనూ అతనికి సంబంధం లేదని డీఎస్పీ చౌహాన్ వెల్లడించారు.

రాష్ట్రాల హక్కులు హరిస్తున్న కేంద్రం

ఖమ్మం బహిరంగ సభలో కేరళ సీఎం విజయన్ విమర్శ



విశాలాంధ్ర బ్యూరో- ఖమ్మం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను హరించి వేస్తోందని కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతోందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ విమర్శించారు. ఖమ్మంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభల ప్రారంభం సందర్భంగా గురువారం ఖమ్మంలో జరిగిన బహిరంగ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల దేశం అన్ని రంగాల్లోనూ అధోగతి పాలయిందన్నారు. భారత రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. మోదీ ప్రభుత్వ ఆర్థిక విధానాలు దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టే విధంగా ఉన్నాయన్నారు. కేంద్ర రాష్ట్ర ఉమ్మడి జాబితాలోని అంశాలను కూడా పార్లమెంట్లో చట్టాలు తెచ్చి రాష్ట్రాలకు ఉన్న హక్కులను సైతం కేంద్రం కాలరాస్తోందని విమర్శించారు. విద్యుత్ బిల్లులు వ్యవసాయ రంగానికి ఇచ్చే రాయితీలతో సహా అనేక విషయాల్లో కేంద్రం జోక్యం చేసుకుంటోందని వాటిని రైతులకు అందించకుండా అడ్డుపడే ప్రయత్నం చేస్తోందని విజయన్ విమర్శించారు. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలు నానాటికి అంతరించి పోతున్నాయని అనేక సంస్థలను కేంద్రం కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తోందన్నారు. మతోన్మాద విధానాలతో దేశంలో ప్రజల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నాలను బీజేపీ ముమ్మరం చేసిందనీ, దీని పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. మతోన్మాద బీజేపీని అడ్డుకునే శక్తి కమ్యూనిస్టులకే ఉందని చెప్పారు బీజేపీని అడ్డుకునేందుకు కమ్యూనిస్టులతో పాటు ప్రజాస్వామ్య శక్తులు ఏకం కావాలని విజయన్ పిలుపునిచ్చారు. దేశంలో నాలుగు లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ, ఖమ్మం జిల్లాతో సహా రాష్ట్రంలో కమ్యూనిస్టుల మద్దతు ఎటు ఉంటే విజయం ఆ పార్టీ వైపే ఉంటుందని అన్నారు. ఖమ్మం జిల్లా అంటే కమ్యూనిస్టుల ఖిల్లా అని చెప్పారు . బీజేపీకి వ్యతిరేకంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ గట్టిగా పోరాడుతున్నారని అందుకే కమ్యూనిస్టు పార్టీలు ఆయనకు మద్దతునిచ్చాయని చెప్పారు ఎన్నికల సందర్భంలో పొత్తులు ఉంటాయా ఉండవా అనే విషయం అప్పుడే తేలుతుందని ఇప్పుడు అది అక్కరలేని అంశమని అన్నారు.

సమాన పనికి సమాన వేతనం

- యాజమాన్యం అంగీకారం
- ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ(ఏపీఎండీసీ)లో పనిచేస్తున్న 937 అవుట్ సోర్సింగ్ సిబ్బందికి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం వర్తింపునకు యాజమాన్యం అంగీకరించిందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు తెలిపారు. ఏపీఎండీసీ మేనేజింగ్ డైరెక్టర్ వెంకటరెడ్డితో ఓబులేసు, యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.మురళి గురువారం చర్యలు నిర్వహించారు. ఈ చర్చల్లో ఏపీ ఎండీసీ సంస్థల్లో పనిచేస్తున్న (మంగంపేట, విజయవాడ హెడ్ ఆఫీస్, చీమకుర్తిలో పనిచేస్తున్న) మొత్తం అవుట్ సోర్సింగ్ సిబ్బందికి సమాన పనికి సమాన వేతనం ఇచ్చేందుకు అంగీకరించారని ఓబులేసు తెలిపారు. 2022 ఫిబ్రవరి 4న జరిగిన అగ్రిమెంట్ ప్రకారం మంగంపేట బ్రాంచ్‌లో ఉన్న 707 మందికి వారి హోదా ప్రకారం కాకుండా, అందర్నీ ఎంటీ1, ఎంటీ2గా విభజించి ఇచ్చేదాన్ని సరిదిద్దారన్నారు. అసిస్టెంట్ గ్రేడ్-2 కింద ఏఏ హోదా కింద పని చేస్తున్నారో వారందరికీ హోదాని పరిరక్షిస్తూ సమాన పనికి సమాన వేతనం (గ్రేడ్ ప్రకారం ఇవ్వడానికి, 2022 ఫిబ్రవరి 4న జరిగిన ఒప్పందాన్ని ప్రధాన కార్యాలయంలో ఉన్న 175 మంది చీమకుర్తిలో పనిచేస్తున్న 55 మంది కార్మికులకు కూడా వర్తించి అమలు చేసేందుకు ఎండీ అంగీకరించారన్నారు.

దీనితోపాటు ప్రాఫిట్ షేరు 1శాతం లెక్కన రూ.30 వేలకు తగ్గకుండా నూతన సంవత్సరం కానుకగా ఇవ్వడానికి అంగీకరించారనీ, ఇది కార్మికుల సంఘటిత పోరాటానికి విజయమని ఓబులేసు స్పష్టం చేశారు. రాష్ట్రంలో మొదటి సంస్థగా సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయడం గొప్ప విజయమని తెలిపారు.

ఫిబ్రవరి 23 నుంచి మార్చి 10 వరకు యూజీసీ-నెట్

న్యూఢిల్లీ: అసిస్టెంట్ ప్రొఫెసర్‌ల నియామకం కోసం నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (ఎన్ఈటీ) ఫిబ్రవరి 23 నుంచి మార్చి 10, 2023 వరకు నిర్వహించనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) గురువారం ప్రకటించింది. ఈ పరీక్ష 83 సబ్జెక్టులలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ)గా ఉంటుంది. యూజీసీ చైర్మన్ ఎం.జగదీష్ కుమార్ మాట్లాడుతూ, యూజీసీ-నెట్ నిర్వహించేందుకు ఎన్‌టీఏకి అప్పగించామన్నారు. ఈ పరీక్ష వర్సిటీలు, కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (జీఆర్ఎఫ్) కావడానికి అర్హత నిర్ణయిస్తుంది. ఎన్‌టీఏ- జేఆర్ఎఫ్ కోసం యూజీసీ-నెట్ డిసెంబర్ ఎడిషన్, 83 సబ్జెక్టులలో అసిస్టెంట్ ప్రొఫెసర్ అర్హతను సీబీటీ మోడ్‌లో నిర్వహిస్తుంది. డిసెంబరు 29 నుంచి జనవరి 17 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తారు. ఫిబ్రవరి 23 నుంచి మార్చి 10 వరకు పరీక్ష నిర్వహిస్తారు.

యాజమాన్య లోపమే...

లారస్ ల్యాబ్ ప్రమాదంపై జేవీఎస్ఎన్

విశాలాంధ్ర-అనకాపల్లి: యాజమాన్య లోపాలే లారస్ ల్యాబ్‌లో ప్రమాదానికి కారణమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి అన్నారు. ఈ నెల 26న పరవాడ జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలోని లారస్ ల్యాబ్, బ్రాండిక్స్‌లో జరిగిన ప్రమాదాలపై జిల్లా కేంద్రం నాలుగు రోడ్ల జంక్షన్, అంబేద్కర్ విగ్రహం వద్ద గురు వారం సీపీఐ ఆందోళనకు దిగింది. జేవీ సత్యనారాయణమూర్తి మాట్లా డుతూ లారస్ ల్యాబ్ ప్రమాదంలో నలుగురు మరణించిన విషయాన్ని యాజమాన్యం బయటికి రానివ్వలేదని విమర్శించారు. కనీసం మృతుల కుటుంబాలకు సైతం సమాచారం ఇవ్వలేదని మండిపడ్డారు. దీనికి బాధ్యులైన కంపెనీ అధికారులు, పరిశ్రమశాఖ అధికారులు, కాలుష్య నియంత్రణ మండలి అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు యూనిట్ నిర్వహణపై సమగ్ర అవగాహన లేదని, టాల్విన్ లీక్ అవుతున్నప్పుడు యూనిట్‌ని ఆపి, లీక్ సరిచేసిన తర్వాత పని ప్రారంభించాలని, కారుతున్న టాల్విన్‌ను పాలథిన్ సంచులలో సేకరిం చడం పొరపాటన్నారు. కనీస భద్రతా ప్రమాణాలు పాటించకుండా కార్మికుల ప్రాణాలు బలిగొంటున్న బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు కోటి రూపాయల వంతున, క్షతగాత్రులకు రూ.50 లక్షల వంతున ఆర్థిక సహాయం అందించాల న్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, సహాయ కార్య దర్శులు రాజాన దొరబాబు, రాము నాయుడు, నాయకులు సన్యాసిరావు, గురుబాబు, సుబ్బలక్ష్మి, అప్పలరాజు, అర్జున్, దేముడు బాబు, మాధవ రావు, మునగపాక సత్తిబాబు, చెల్లూరి నాగరాజు, వైఎస్.భద్రం, కోన లక్ష్మణ, వియ్యపు రాజు, హరీష్, సత్యనారాయణ, పోతురాజు పాల్గొన్నారు.

'పర్యావరణ' ఉల్లంఘనలపై

ఫిబ్రవరిలోగా సమాధానమివ్వండి

కేంద్రం సహా ఏపీ, తెలంగాణ, ఒడిశాకు సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పోలవరం ఎత్తిపోతల పథకం పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇందుకు నిధుల కొరతే కారణమని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. ఇందుకోసం కేంద్రప్రభుత్వ సహకారాన్ని కోరుతోంది. ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులను ఒక్కొక్కటిగా పొందుతోంది. అయితే పర్యావరణపరమైన అనుమతులు పొందే క్రమంలో కొన్ని అతిక్రమణలు జరిగినట్లు సుప్రీంకోర్టులో ఫిర్యాదు దాఖలైంది. దీనిని విచారించిన జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎంఎం సందేశ్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం కేంద్రప్రభుత్వంతో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. ఫిబ్రవరిలోగా సమాధానం తెలపాలని ఆదేశాలిచ్చింది. అయితే ఈ ఫిర్యాదును న్యాయ వాది శ్రావణ్ కుమార్ ద్వారా ఆర్థికవేత్త పెంటపతి పుల్లారావు దాఖలు చేశారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాలను అందులో సవాల్ చేశారు. పర్యావరణ, అడవుల శాఖ సంయుక్త కమిటీ, జలశక్తి మంత్రిత్వశాఖ, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ బోర్డు, పోలవరం ప్రాజెక్టు యంత్రాంగం నివేదికను ఎన్జీటీ పరిగణ నలోకి తీసుకోలేదని ఆరోపించారు. సైట్‌లో పర్యావరణకు సంబంధించి ఉల్లంఘనలు జరిగాయని, ప్రాజెక్టు అధికారులు సూచించిన ముందస్తు చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. ప్రాజెక్టు సమీపంలోని వ్యవసాయ భూమిని చెత్త డంపింగ్ యార్డుగా మార్చివేశారని పుల్లారావు తన ఫిర్యాదులో కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అన్ని అంశాలను పరిశీలించిన ధర్మాసనం ఫిబ్రవరిలోగా సమాధానాలు కోరుతూ కేంద్రంతో పాటు మూడు రాష్ట్రాల ప్రభుత్వాలకు నోటీసులు జారీచేసింది. ఇదిలావుంటే, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బుధవారం పోలవరం ప్రాజెక్టు కోసం రూ.10,485.38కోట్లను కేంద్రప్రభుత్వం నుంచి అడ్‌హాక్ చెల్లింపుల కింద కోరారు. అలాగే గోదావరి నదిపై ప్రాజెక్టుకు సంబంధించి రూ.2,937.92 కోట్ల పెండింగ్ బిల్లులు చెల్లించాలని కూడా విన్నవించారు.

మీకు కష్టం వస్తే...

నా ఇంటి తలుపు తట్టండి: చిరంజీవి

హైదరాబాద్: హైదరాబాద్ చిత్రపురి కాలనీలో సామూహిక గృహ ప్రవేశ కార్యక్రమాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెగాస్టార్ చిరంజీవి, తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్, నిర్మాతలు సి కల్యాణ్, తమ్మారెడ్డి భరద్వాజ, చిత్రపురి కాలనీ అధ్యక్షుడు అనిల్ కుమార్ వల్లభనేని, ఎఫ్‌డీసీ చైర్మన్ అనిల్ కూర్మాచలం, ఫిలిం చాంబర్ ప్రెసిడెంట్ బసిరెడ్డి, మణికొండ మున్సిపల్ లీడర్స్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 1,176 ఎంఐజీ, 180 హెచ్ఐజీ డూప్లెక్స్ ఫ్లాట్స్ ఓనర్స్‌కు చిరంజీవి చేతుల మీదుగా ఇంటి తాళాలు అందజేశారు. అనంతరం చిరంజీవి మాట్లాడుతూ.. "మా సినీ కార్మికుల సమక్షంలో జరిగిన ఈ వేడుకకు అతిథిగా రావడం సంతోషంగా ఉంది. మనం తిన్నా.. తినకున్నా మనకొక ఇల్లు ఉండటం అనే తృప్తే వేరు. ఆ సొంతింటి కలను మన సినీ కార్మిక సోదరులకు నిజం చేసిన ఈ చిత్రపురి కమిటీ వారికి అభినందనలు. ఈ సమయంలో మనం గుర్తు చేసుకోవాల్సింది స్వర్గీయ ఎం ప్రభాకర్ రెడ్డిని. ఆయన దూరదృష్టితో ఈ సొసైటీ కోసం చేసిన కృషి ప్రశంసనీయం. ఆయన కల ఇవాళ నెరవేరింది. దాసరి, రాఘవేంద్రరావు, భరద్వాజ వంటి వారందరూ దీనిని అద్భుతమైన సొసైటీగా తీర్చిదిద్దారు. దేశంలో మరే సినీ పరిశ్రమలోనూ సినిమా కార్మికులకు ఇంత పెద్ద గృహసముదాయం లేదు. ఈ కమిటీ చాలా నిజాయతీగా పనిచేస్తుండటం వల్లే పనులు జరుగుతున్నాయి. సి కళ్యాణ్, తమ్మారెడ్డి భరద్వాజ లాంటి వాళ్లంతా నన్ను ఇండస్ట్రీ పెద్ద అంటున్నారు. వాళ్ల వయసు తగ్గించుకునేందుకు నన్ను పెద్ద అంటున్నారేమో అనిపిస్తోంది. చిత్ర పరిశ్రమ నాకెంతో ఇచ్చింది. అందులో నుంచి నా వంతుగా సినీ కార్మికులకు, కళాకారులకు సాయం చేస్తాను. నేను ఎదిగానని పెద్దరికం చేయాలని లేదు. సినీ కార్మికులకు నేను ఎప్పుడూ అండగా ఉంటాను. అవసరం వచ్చినప్పుడు మీ వెంట ఉండేది నేనే. మీకు కష్టం వస్తే నా ఇంటి తలుపు తట్టండి.." అని అన్నారు.

నటుడు వల్లభనేని జనార్దన్ మృతి

హైదరాబాద్: తెలుగు చిత్రపరిశ్రమలో మరో విషాదం చోటుచేసుకుంది. సీనియర్ నటుడు వల్లభనేని జనార్దన్ (63) తుదిశ్వాస విడిచారు. కొంతకాలంగా అనారోగ్యంతో ఇబ్బందిపడుతోన్న ఆయన గురువారం తెల్లవారుజామున మరణించారు. ఆయన మరణం పట్ల టాలీవుడ్ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలోని విజయవాడకు చెందిన జనార్దన్‌కు చిన్నప్పటి నుంచి నాటకాలపై ఆసక్తి ఎక్కువ. దీంతో కాలేజీ రోజుల్లోనే అనేక నాటకాల్లో కీలకపాత్రలు పోషించి తోటి విద్యార్థులను అలరించారు. కళాశాల చదువు పూర్తయిన వెంటనే 'కళామాధురి' అనే నాటక సంస్థను స్థాపించి ఎన్నో ప్రదర్శనలు ఇచ్చారు. ఈ క్రమంలోనే తెలిసినవారి సాయంతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి.. ప్రముఖ దర్శకుడు రాఘవేంద్ర రావు తెరకెక్కించిన 'గజదొంగ' కోసం మొదటిసారి వెండితెరపై నటించారు. సినిమాల్లో రాణిస్తున్న సమయంలో దర్శకుడు విజయ బాపినీడు కుమార్తెను ఆయన వివాహమాడారు. అనంతరం తన మామయ్య తెరకెక్కించిన 'గ్యాంగ్‌లీడర్'లో పోలీస్ అధికారిగా నటించి గుర్తింపు సొంతం చేసుకున్నారు. ఈ సినిమా తర్వాత తెలుగులో ఆయనకు వరుస అవకాశాలు వచ్చాయి. సినిమాల్లోనే కాకుండా అనేక ధారావాహికల్లోనూ ఆయన నటించారు. నిర్మాత, దర్శకుడిగా అనేక చిత్రాలను ప్రేక్షకులకు అందించారు.

రికార్డు సృష్టించిన 'అవతార్2'

హైదరాబాద్: జేమ్స్ కామెరూన్ నుంచి వచ్చిన విజువల్ వండర్ 'అవతార్ 2' 'అవతార్: ది వే ఆఫ్ వాటర్' టైటిల్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. గతంలో విడుదలైన 'అవతార్'కు సీక్వెల్‌గా ఈ చిత్రం రూపొందింది. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా 160 భాషల్లో విడుదలైంది. అందుబాటులో ఉన్న అన్ని ఫార్మాట్స్‌లో మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చారు. 'అవతార్ 2' పై భారీ బజ్ ఉండటంతో సినిమా సంచలన విజయం సాధించింది. బాక్సాఫీస్ వద్ద భారీ స్థాయి వసూళ్లను రాబట్టింది. అత్యంత వేగంగా వన్ బిలియన్ డాలర్స్ కలెక్షన్స్‌ను సాధించిన చిత్రంగా 'అవతార్ 2' రికార్డును నెలకొల్పింది. ఇండియాలో ఈ సినిమా రెండు వారాల్లోపే రూ.350కోట్ల గ్రాస్ వసూళ్లను రాబట్టడం విశేషం. 'టాప్ గన్: మావెరిక్', 'జురాసిక్ వరల్డ్ డామినియన్' ఈ ఏడాది వన్ బిలియన్ డాలర్స్ వసూళ్లను రాబట్టాయి. అయితే, అత్యంత వేగంగా వన్ బిలియన్ డాలర్స్ కలెక్షన్స్‌ను సాధించిన చిత్రంగా 'స్పైడర్ మ్యాన్: నో వే హోమ్' పేరిట గతంలో రికార్డు ఉండేది. 'స్పైడర్ మ్యాన్' చిత్రం ఆ స్థాయి వసూళ్లను 12రోజుల్లో రాబట్టింది. కానీ, 'అవతార్ 2' మాత్రం అంతకంటే తక్కువ సమయంలోనే భారీ కలెక్షన్స్‌ను సాధించడం చెప్పుకోదగ్గ విశేషం. 'అవతార్' 2009లో విడుదలైన సంగతి తెలిసిందే. ఈ చిత్రం అప్పట్లో సంచలన విజయం సాధించింది. ప్రపంచవ్యాప్తంగా 2.97బిలియన్ డాలర్స్ కలెక్షన్స్‌ను కొల్లగొట్టింది.

డబ్ల్యూటీసీ ఫైనల్ అవకాశాలు మెరుగు



ముంబై: దక్షిణాఫ్రికాతో మూడు టెస్టుల సిరీస్‌లో ఆస్ట్రేలియా 2-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. మెల్‌బోర్న్ వేదికగా జరిగిన రెండో టెస్టులో సఫారీలపై ఆసీస్ ఇన్నింగ్స్ 182 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో ఆసీస్ తన మొదటి స్థానాన్ని సుస్థిరం చేసుకొంది. ఇక రెండో స్థానంలో ఉన్న టీమిండియాకు ఫైనల్స్ అవకాశాలు కాస్త మెరుగు కావడం విశేషం. ఘోర ఓటమితో ఖంగుతిన్న దక్షిణాఫ్రికా నాలుగో స్థానానికి పడిపోయింది. ఇప్పటి వరకు ఆస్ట్రేలియా 14 టెస్టుల్లో 10 విజయాలు, ఒక ఓటమి, మూడు డ్రాలతో 132 పాయింట్లు సాధించి 78.57 శాతంతో అగ్రస్థానంలో ఉంది. దక్షిణాఫ్రికాతో చివరి టెస్టులోనూ విజయం సాధిస్తే డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరుకొన్నట్లే. ఆసీస్ తర్వాత భారత్ 58.93 శాతంతో రెండో స్థానంలో నిలిచింది. స్వదేశంలో ఆస్ట్రేలియాతో నాలుగు టెస్టుల సిరీస్‌లో మూడు మ్యాచ్‌లు గెలిస్తే భారత్ కూడా తన విన్నింగ్ పర్సంటేజీని పెంచుకొని ఫైనల్ బెర్తును ఖరారు చేసుకోవడం ఖాయం. తాజాగా ఆసీస్‌తో టెస్టు సిరీస్‌ను కోల్పోయిన దక్షిణాఫ్రికా మూడు నుంచి నాలుగో స్థానానికి పడిపోయింది. శ్రీలంక (53.33 శాతం) మూడో స్థానానికి చేరుకోగా.. దక్షిణాఫ్రికా 50 శాతంతో నాలుగుకు చేరింది. బజ్‌బాల్ క్రికెట్‌తో టెస్టుల్లో సంచలన విజయాలు సాధించిన ఇంగ్లండ్ (46.97 శాతం) ఐదో స్థానం, వెస్టిండీస్ (40.91 శాతం) ఆరో స్థానంలో నిలిచాయి. ఇంగ్లండ్ చేతిలో టెస్టు సిరీస్‌ను చేజార్చుకొన్న పాకిస్తాన్ (38.89 శాతం) ఏడో స్థానానికి దిగజారింది. ఇక న్యూజిలాండ్ (25.11 శాతం), బంగ్లాదేశ్ (11.11 శాతం) ఎనిమిది, తొమ్మిదో స్థానాల్లో కొనసాగుతున్నాయి.

సూపర్ అవార్డు రేసులో సూర్యకుమార్ యాదవ్

న్యూఢిల్లీ: ఐసీసీ ఈ ఏడాదికి 'టీ20 ప్లేయర్ ఆఫ్ ది ఇయర్' అవార్డుకు నామినేషన్లను ప్రకటించింది. ఈ అవార్డు కోసం నలుగురు ఆటగాళ్ల మధ్య పోటీ ఉన్నట్లు ఐసీసీ వెల్లడించింది. ఈ రేసులో భారత్ నుంచి ప్రపంచ నెంబర్ వన్ టీ20 బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ కూడా పోటీలో ఉన్నాడు. అతనికే ఈ అవార్డు దక్కుతుందని అభిమానులు బల్లగుద్ది మరీ చెబుతున్నారు. అతనితో పోలిస్తే మిగతా వాళ్లు అంత గొప్పగా ఏం సాధించలేదని వాదిస్తున్నారు. ఏడాది ముగుస్తున్న నేపథ్యంలో 2022కు గానూ 'ఐసీసీ టీ20 ప్లేయర్ ఆఫ్ ది ఇయర్' అవార్డును అందించాలని నిర్ణయించింది. ఈ అవార్డు కోసం టీమిండియా టీ20 స్పెషలిస్టు సూర్యకుమార్ యాదవ్, ఇంగ్లండ్ స్టార్ ఆల్‌రౌండర్ శామ్ కరన్, పాకిస్తాన్ వికెట్ కీపర్ బ్యాటర్ మహమ్మద్ రిజ్వాన్, జింబాబ్వే ఆల్‌రౌండర్ సికందర్ రజా పోటీ పడుతున్నారు. వీరిలో సూర్యకుమార్ యాదవ్ ఏడాది మొత్తం సూపర్ ఫామ్ కొనసాగించిన సంగతి తెలిసిందే. శామ్ కరన్ ఏడాది ఆరంభంలో పెద్దగా పొట్టి ఫార్మాట్ ఆడలేదు. అయితే టీ20 వరల్డ్ కప్‌లో అద్భుతంగా రాణించాడు. ఈ మెగా టోర్నీలో 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డుతోపాటు ఫైనల్ మ్యాచ్‌లో 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు కూడా అందుకున్నాడు. దీంతో ఐసీసీ అవార్డు రేసులో సూర్యకు గట్టి పోటీ ఇస్తున్నాడు. ఇక మహమ్మద్ రిజ్వాన్ సంగతి చూస్తే.. అతను టీ20ల్లో పెద్దగా ఆకట్టుకోలేదు. నెమ్మదైన ఆటతీరుతో అభిమానుల నుంచి తీవ్రమైన విమర్శలు ఎదుర్కొన్నాడు. క్రీజులో కుదురుకోవడంపై ఎక్కువగా ఫోకస్ పెట్టిన అతను.. మ్యాచులు గెలిపించడంలో విఫలమయ్యాడు. సికందర్ రజా ఈ ఏడాది జింబాబ్వే తరపున అద్భుతంగా ఆడాడు. ముఖ్యంగా టీ20 వరల్డ్ కప్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగాడు. అటు బ్యాటుతో, ఇటు బంతితో ఆకట్టుకున్నాడు. పాకిస్తాన్‌తో జరిగిన టీ20 వరల్డ్ కప్ మ్యాచులో బ్యాటుతో రాణించకపోయినా.. బంతితో మూడు కీలక వికెట్లు తీసుకొని జట్టుకు విజయాన్ని అందించాడు. దీంతో అతను కూడా 'ఐసీసీ టీ20 ప్లేయర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు రేసులో నిలిచాడు.

రోహిత్ శర్మ ప్రాక్టీస్ మొదలు

ముంబై: శ్రీలంకతో జరగనున్న వన్డే సిరీస్‌కు టీమిండియా పగ్గాలను సెలక్టర్లు రోహిత్ శర్మకు తిరిగి అందించారు. దీంతో బొటనవేలి గాయం నుంచి కొలుకొని రోహిత్ అందుబాటులో ఉంటాడని బీసీసీఐ చెప్పినట్లయింది. మరోవైపు హిట్‌మ్యాన్ ట్రైనింగ్ సెషన్‌కు సంబంధించిన రెండు ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకొన్నాడు. 'అక్కడకు వస్తున్నా' అని క్యాప్షన్‌ను జోడించాడు. దీనికి టీమిండియా బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ 'హార్ట్-ఐస్' ఎమోజీతో స్పందించాడు. ఇక అభిమానులు కూడా '2023 నీదే.. రానున్న ఏడాదికి నీకు ఆల్‌ది బెస్ట్. నీ టైం వచ్చింది", '2023లో హిట్ మ్యాన్ షో ఉంటుందా" అని కామెంట్లు పెట్టారు. స్వదేశంలో శ్రీలంకతో జరగనున్న టీ20, వన్డే సిరీస్‌లకు సంబంధించి బీసీసీఐ సారథ్యంలోని సీనియర్ సెలెక్షన్ కమిటీ వేర్వేరుగా టీమిండియా జట్లను ప్రకటించింది. జనవరి 10, 12, 15 తేదీల్లో వన్డేలు జరగనున్నాయి. ఈ ఫార్మాట్‌కు రోహిత్ శర్మ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.